క్రూయిజర్ క్రేజ్

- హార్లే డేవిడ్‌సన్, బీఎండబ్ల్యూ, కవాసాకి బైకుల సందడి
- రాష్ట్రవ్యాప్తంగా ఇక్కడి నుంచే అమ్మకాలు
- సర్వీసు సెంటర్లు కూడా అందుబాటులో..
- రూ.2 లక్షల-రూ.45 లక్షల వరకు మోడళ్లు
- యూనిక్ కస్టమైజేషన్‌తో నచ్చినట్టుగా తయారీ

బెజవాడ కేంద్రంగా బైక్స్ షోరూమ్‌లు





రాయల్ ఎన్‌ఫీల్డ్, హార్లేడేవిడ్‌సన్, కవాసాకి, బీఎండబ్ల్యూ..

మెట్రోపాలిటన్ సిటీల్లో మాత్రమే కనిపించే ఈ హై ఎండ్ బైకులు ఇప్పుడు బెజవాడలో కూడా హాయ్ చెబుతున్నాయి. ఈ బైక్ షోరూమ్‌లు ఇప్పుడు రాజధాని సిటీకి కూడా వచ్చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా విజయవాడ నుంచే ఈ బైకులు సరఫరా అవుతుండగా, మచిలీపట్నం, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు వంటి పట్టణాలకూ ఈ మోజు పెరిగిందంటే యువత ఎంత వేగాన్ని కోరుకుంటుందో అర్థమవుతుంది. వీటి ధరలు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఉన్నా సేల్స్ ఏమాత్రం తగ్గకపోవడం కుర్రకారు క్రేజ్‌ను తెలియజేస్తోంది.

- కథనం 8లో



సండే స్పెషల్

రూ.18 లక్షలు ఖరీదు చేసే బీఎండబ్ల్యూ బైక్



మండలి ఫౌండేషన్ తరఫున రమణకు అవార్డు ప్రదానం చేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్. చిత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు 8

నిస్వార్థ సేవాతత్పరుడు మండలి కృష్ణారావు

- మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవం పురస్కారం అందుకున్న జస్టిస్ ఎన్వీ రమణ

ఎరువు.. కరువు

సొసైటీల్లో కృత్రిమ కొరత



జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా అవుతున్న ఎరువులు సొసైటీకి చేరిన గంట వ్యవధిలోనే మాయం చేసేస్తున్నారు. గ్రామాల్లోని బడా రైతులు, కూటమి నాయకులు ఈ పని చేస్తుండగా, వ్యాపారుల లింకులతో ప్రైవేట్ రిటైలర్లు ఎరువులు కొనడానికి ముందుకు రావట్లేదు. లింకు పేరుతో యూరియాతో పాటు జింక్, దుబ్బు గుళికలు, వేపపిండిని కొనాలని కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో 15 రోజులుగా యూరియా అందుబాటులో లేక రైతులు అల్లాడిపోతున్నారు.

- కూటమి నాయకులు, బడారైతుల చేతివాటం
- గంట వ్యవధిలోనే ఎరువులు మాయం
- బేరగాళ్లతో సొసైటీ ఉద్యోగుల మిలాఖత్
- 15 రోజులుగా యూరియా దొరక్క రైతుల పాట్లు
- లింక్ పేరుతో కంపెనీల భారీ దోపిడీ
- జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో వరిసాగు
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆంధ్రజ్యోతి-గుడివాడ : జిల్లావ్యాప్తంగా ఉన్న 212 సొసైటీలకు గానూ కేవలం 152 సొసైటీల ద్వారానే మార్క్‌ఫెడ్ ఎరువులు అమ్ముతున్నారు. ఇప్పటికే సొసైటీలకు 10,293 మెట్రిక్ టన్నుల యూరియా, సొసైటీలు అందుబాటులో లేని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు 45 మెట్రిక్ టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్ ద్వారా సరఫరా చేశారు. రెండు విడతలకు సరిపడా యూరియాను సరఫరా చేసినా.. ఎందుకు కొరత ఏర్పడిందోనని వ్యవసాయ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సరఫరా అవుతున్న ఎరువులు గంట వ్యవధిలోనే మాయమై పోతుండటం గమనార్హం.

బడాబాబులు, రాజకీయ నేతల కన్ను

ఎటువంటి లింకులు లేకుండా నేరుగా సొసైటీలకు ఎరువులు సరఫరా అవుతుండటంతో బడాబాబులు, ఆక్వా రైతుల కన్ను వీటిపై పడింది. ముఖ్యంగా సొసైటీల్లోని ఉద్యోగులు చేతివాటం చూపిస్తున్నారు. ఉద్యోగులకున్న లింకుతో ఎరువులను మాయం చేసేస్తున్నారు. బేరగాళ్లకు పంటను తోలే రైతుల కోసం ఎరువులను పక్కదారి పట్టిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సొసైటీలకు సరఫరా అయిన డీఏపీ, యూరియాను రాత్రికి రాత్రే తరలించేశారు. ముఖ్యంగా ఆక్వాసాగు ఉన్న ప్రాంతాల్లో.. లారీలు సొసైటీలకు రాకముందే ఆయా ఆక్వా రైతుల చెరువులకు చేరిపోతున్నాయి. అలాగే, బడారైతులు, కూటమి నాయకులు యూరియాను తమ గోడౌన్లకు తరలించి బ్లాక్ చేసేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు సొసైటీల్లో ఇదే రీతిలో ఎరువులను పక్కదారి పట్టించారు. అలాగే, తాము సూచించిన వారికే ఎరువులు ఇవ్వాలని కూటమి నాయకులు హుకుం మిగతా 6లో..

16 లక్షల బస్తాల యూరియా అవసరం

జిల్లావ్యాప్తంగా సాగవుతున్న 4 లక్షల ఎకరాల వరికి యూరియా 16 లక్షల బస్తాలు అవసరం. మార్కెట్‌లో ఐదుశాతం యూరియా కూడా అందుబాటులో లేదు. మొదటి దశలోనే ఎరువుల కొరత ఏర్పడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎరువుల కొరత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి కొల్లు రవీంద్ర 6



మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో ఆదివాసీ నృత్య ప్రదర్శన

పామర్రులో ఎయిమ్స్ బ్రాంచ్


- యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు కరకట్ట ఎత్తు పెంపునకు రూ.150 కోట్లు
- కంకిపాడు నుంచి గుడివాడ వరకు రూ.600 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ రహదారి : ఎంపీ బాలశౌరి వెల్లడి

6



ఎయిమ్స్ ప్రతినిధులతో ఎంపీలు బాలశౌరి, కేశినేని చిన్ని

విజయవాడలోని సృష్టి యూనివర్సల్ భవనం



సమస్యలు సృష్టించిందెవరు?

సృష్టి సంతాన సాఫల్య కేంద్రం కేసులో విజయవాడ మూలాలు

- ఆరా తీస్తున్న విశాఖలోని గోపాలపురం పోలీసులు
- నవజాత శిశువులను విక్రయించే ముఠాలతో లింకులు?
- పిల్లలు తీసుకొచ్చి ఇచ్చిన వారికి రూ.లక్షల నజరానా
- నగరంలోని ప్రైవేట్ డాక్టర్లతో తెరచాటు వ్యవహారాలు
- డాక్టర్ నమ్రత అరెస్టుతో వారంతా అజ్ఞాతంలోకి..


సరోగసి పేరుతో సర్వం దోచుకుని కాసులు వెనుకేసుకున్న సృష్టి సంతాన సాఫల్య కేంద్రం అధినేత డాక్టర్ పచ్చిపాల నమ్రత కేసులో విజయవాడకు లింక్‌లు ఉన్నాయా? పిల్లలను విక్రయించే ముఠాలతో ఆమె సత్సంబంధాలు నడిపారా? వైద్యుల్లో కొందరు నమ్రతకు కేసులను అప్పగించారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. నమ్రత కేసులో తవ్వేకొద్దీ సంచలనాలు బయటకు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : సృష్టి సంతాన సాఫల్య కేంద్రం అధినేత డాక్టర్ పచ్చిపాల నమ్రత కేసులో పిల్లల విక్రయాల్లో దళారులుగా వ్యవహరించిన ముగ్గురిని, విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో అనస్థీషియా వైద్యుడు వాసుపల్లి రవిని, పిడియాట్రిక్ విభాగ వైద్యురాలు ఉషాదేవిని గోపాలపురం పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిరుపేదల కుటుంబాలను టార్గెట్ చేసుకుని వారి నుంచి పిల్లలను కొన్న వ్యవహారంలో వీరు అరెస్టయ్యారు. విజయవాడకు మిగతా 6లో..

కీచక టీచర్లు

పాఠశాలల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు

- నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలంలోని చందర్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిపై 25 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. తమను చెప్పకోకూడని చోట తాకుతూ, తమ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఓ లేఖలో వారంతా పేర్కొన్నారు. తమతో పాటు ఇంకా చాలామంది బాధితులు ఉన్నారని, వారంతా ధైర్యంచేసి చెప్పుకోలేకపోతున్నారన్నారు. ఆ ఉపాధ్యాయుడి గురించి కొందరు ఉపాధ్యాయినులకు చెప్పామని, వారు హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చినా స్పందన లేదన్నారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని మరో పాఠశాలలో ముగ్గురు విద్యార్థినులు కూడా ఒక ఉపాధ్యాయుడిపై ఇలాంటి ఫిర్యాదే చేశారు.



..ఇటీవల జిల్లాలో ప్రభుత్వం నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో బయటపడిన నిజాలివి. కొన్ని పాఠశాలల్లో మదమెక్కిన మానవమృగాలు చేస్తున్న వికృత చేష్టల చిట్టా ఇది. కేవలం 50 పాఠశాలల్లో జరిగిన సోషల్ ఆడిట్‌లోనే ఇన్ని ఫిర్యాదులు వస్తుండగా, జిల్లా అంతటా పరిస్థితి ఎలా ఉందనే చర్చ మొదలైంది. తమ సమస్యల కోసం నిత్యం ఉద్యమాలు నిర్వహించే ఉపాధ్యాయ సంఘాలు ఈ పరిస్థితులపై మాత్రం నోరు మెదపకపోవడం గమనార్హం.

- ఎన్టీఆర్ జిల్లాలో జరుగుతున్న సోషల్ ఆడిట్‌లో నిజాలు
- నందిగామ, జగ్గయ్యపేట విద్యార్థినుల ఫిర్యాదులు
- హెచ్‌ఎంలతో ఉన్నతాధికారుల అత్యవసర సమావేశం
- సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు హెచ్చరికలు
- కీచకులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్

నందిగామ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఏం జరుగుతుందన్న అంశాలను అధ్యయనం చేసేందుకు మంత్రి లోకేశ్ 'సోషల్ ఆడిట్' పేరుతో సమగ్ర విషయ సేకరణ నిర్వహించాలని ఆదేశించగా, కొద్దిరోజులుగా ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతోనూ, తల్లిదండ్రులతోనూ వ్యక్తిగతంగా సమావేశమై పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, మెరుగుపరిచేందుకు చేపట్టాల్సిన మిగతా 6లో..

బయటపడుతున్న బాగోతాలు

జిల్లాలో తొలి విడతగా సుమారు 50 పాఠశాలల్లో సోషల్ ఆడిట్ జరిగింది. వీటిలో కొన్ని పాఠశాలల్లో కీచక ఉపాధ్యాయుల లీలలు బయటపడ్డాయి. విద్యార్థినులు తమపై జరిగిన లైంగిక వేధింపుల గురించి లిఖితపూర్వకంగా లేఖలు అందజేశారు.

'అద్వైక' దర్యాప్తునకు సిట్ ఏర్పాటు

చీఫ్‌గా తిరుమలేశ్వర్‌రెడ్డి నియామకం

11 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్‌ఐలు

విజయవాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సంచలనం కలిగించిన అద్వైక ట్రేడింగ్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ కేసు దర్యాప్తునకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటైంది. దీనికి సంబంధించి ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందంలో 11 మంది ఇన్‌స్పెక్టర్లు, పదిమంది ఎస్‌ఐలను నియమించారు. సిట్‌కు చీఫ్‌గా క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డిని నియమించారు. ఇన్‌స్పెక్టర్లు ఆకుల నాగమురళీ (గవర్నరుపేట), సీహెచ్ ప్రకాశ్ (మాచవరం), వి.పవన్‌కిషోర్ (పటమట), వాసిరెడ్డి శ్రీనివాస్ (గుణదల), డి.చవాన్ (నందిగామ రూరల్), డి.చంద్రశేఖర్ (మైలవరం), కె.కిషోర్‌బాబు (ట్రాఫిక్-3), ఎం.కిషోర్‌బాబు (సీసీఎస్), ఎ.సుబ్రహ్మణ్యం (టాస్క్‌ఫోర్స్), ఎన్.రాజశేఖర్ (వీఆర్), పి.కనకారావు (పీసీఆర్), ఎస్‌ఐలు జి.రాజేంద్ర (కొత్తపేట), బి.అనూష (భవానీపురం), ఎం.ప్రశాంతి (గవర్నరుపేట), జె.భానుప్రసాద్ (కృష్ణలంక), జి.మహాలక్ష్ముడు (నున్న సీసీఎస్), వి.రమ్యశ్రీసత్య (అజిత్‌సింగ్‌నగర్), జి.శంకరరావు (మాచవరం), జి.రేవతి (పటమట), బి.అభిమన్యు (నందిగామ), కె.సుధాకర్ (మైలవరం)తో ఓ టీమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదరరావు దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్నారు. సుమారుగా రూ.300 కోట్ల డిపాజిట్లను అద్వైక వ్యవస్థాపకుడు తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య సేకరించాడు. ప్రస్తుతం అతడిని టాస్క్‌ఫోర్స్‌లో విచారణ చేస్తున్నారు. ఖాతాదారుల నుంచి సేకరించిన డబ్బును దుబాయ్‌లో ఖజానా సంస్థకు హవాలా మార్గంలో మళ్లించినట్టు ఇప్పటికే తేలింది. ఈ కేసులో బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన నిధులు, అద్వైక ఖాతాలకు వచ్చిన నిధుల విషయంలో ఎలాంటి రికార్డులు లేకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడం కష్టంగా మారింది. దీంతో అద్వైక అసలు గుట్టును తేల్చి బాధితులకు న్యాయం చేయడానికి సీపీ ప్రత్యేకంగా సిట్‌ను ఏర్పాటు చేశారు. సిట్‌లో ఉన్నవారంతా క్రైమ్స్ డీసీపీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు.

పాలకులకు పట్టని పోలంపల్లి

- వరదలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్
- నాడు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- నేటికీ కనీస మరమ్మతులు లేవు
- అగమ్యగోచరంలో ఆయకట్టు రైతులు

6



భక్తిప్రపత్తులతో దుర్గమ్మ గిరిప్రదక్షిణ

- రథం వెంట సాగిన భక్తజనం

8

ప్రయాణికులకు రౌండ్ ట్రిప్ ప్యాకేజీ

- చార్జీల్లో రాయితీ ప్రకటించిన రైల్వే



మంత్రి కొల్లు రవీంద్రకు రాఖీ కడుతున్న తెలుగు మహిళలు

మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు తెలుగు మహిళల రాఖీ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పౌర్ణమి వేడుకలు జిల్లా కేంద్రం మచిలీపట్నంలో శనివారం ఘనంగా జరిగాయి. సోదరులకు సోదరీమణులు రాఖీ కట్టి ప్రేమను చాటి చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్యలకు తెలుగు మహిళలు లంకిశెట్టి నీరజ, పాలపర్తి పద్మ, వసంతకుమారి తదితరులు రాఖీలు కట్టారు. మంత్రి కొల్లు రవీంద్రకు కలెక్టరేట్ వద్ద ఎస్టీ బాలికలు, మహిళలు రాఖీలు కట్టారు. మంత్రి రవీంద్ర చినకరగ్రహారం వెళ్లినప్పుడు అక్కడి మహిళలు రాఖీలు కట్టారు.



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్యలకు రాఖీ కడుతున్న తెలుగు మహిళ పద్మ

పటమట పోలీస్ స్టేషన్‌కు వల్లభనేని వంశీ

గుణదల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో కండిషన్ బెయిల్‌పై బయటికి వచ్చిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ శనివారం పటమట పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి సంఘటనలో ప్రత్యక్ష సాక్షి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో కండిషన్ బెయిల్ పొందిన విషయం విదితమే. అయితే ఈ కేసులో ప్రతి శనివారం పటమట పోలీస్ స్టేషన్లో సంతకం పెట్టాల్సిన నిబంధన ఉంది. ఈ నేపథ్యంలో వల్లభనేని వంశీమోహన్ పటమట పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకం చేసి వెళ్లారు.



పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

బస్‌స్టేషన్ ప్రాంగణం శుభ్రంగా ఉంచాలి

బస్‌స్టేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించనున్న నేపథ్యంలోఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ శనివారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం, అధికారులతో కలిసి విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, విజయవాడ డిపోను పరిశీలించారు. తొలుత విజయవాడ డిపోను సందర్శించి బస్సుల వివరాలు, బస్సుల కండిషన్, కార్మికుల పనితీరు, డిపోలో ఉన్న వసతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్‌స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రాంగణంలో చెత్తచెదారం ఉండటం గమనించి వెంటనే గుంతలు పూడ్చి, చెత్తాచెదారం తొలగించి ప్రాంగణం అంతా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. బస్సులు ఇన్‌కమింగ్, అవుట్ గోయింగ్ గేట్ల వద్ద పరిశుభ్రంగా ఉంచి మొక్కలు నాటాలని సూచించారు. చెత్త, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు. సిటీ బస్సు టెర్మినల్‌ను కూడా ఆయన పరిశీలించారు. సిటీ బస్సు టెర్మినల్ ప్రాంగణంలో ఉన్న గుంతలను కూడా పూడ్చాలని, సిటీ టెర్మినల్ వెనుక కాలువ పక్కన ఉన్న పార్క్‌ను మరింత అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏటీఎం శ్యాం ప్రసాద్, పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టించిందెవరు?

(5వ పేజీ తరువాయి)

చెందిన డాక్టర్ నమ్రత హైదరాబాద్‌లో సృష్టి సంతాన సాఫల్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దానికి అనుబంధంగా విజయవాడ, విశాఖపట్నంలో బ్రాంచ్‌లు ఉన్నాయి. విశాఖపట్నం లింక్‌లు బయటపడిన నేపథ్యంలో గోపాలపురం పోలీసులు ఇప్పుడు విజయవాడ లింక్‌లపై దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

శిశువులు విక్రయించే ముఠాతో లింక్‌లా?

విజయవాడ పోలీసులు కొద్దినెలల క్రితం నవజాత శిశువులను విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఉత్తరాది శిశువులను తీసుకొచ్చి విక్రయిస్తుండగా, పక్కా సమాచారంతో అరెస్టు చేశారు. ఈ ముఠాలో అజిత్ సింగ్‌నగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ ముఠా మొత్తం హైదరాబాద్ నుంచే కార్యకలాపాలు నిర్వహించేది. ఇలా పిల్లలను విక్రయించే ముఠాలు విజయవాడలో మూడు, నాలుగు ఉన్నాయి. ఈ ముఠాలతో సృష్టికి సంబంధాలు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ముఠా పలుమార్లు హైదరాబాద్‌లోని సృష్టి కార్యాలయానికి, విజయవాడ గాయత్రీనగర్‌లోని బ్రాంచ్‌కు వెళ్లినట్టు తెలుస్తోంది.

వారంతా అజ్ఞాతంలోకి..

విశాఖపట్నం కేజీహెచ్‌లో వైద్యులు వ్యవహరించినట్టే విజయవాడలోని కొంతమంది ప్రైవేట్ వైద్యులు కూడా వ్యవహరించినట్టు తెలిసింది. ఆంధ్రా వైద్య కళాశాలలో తనతో పాటు వైద్యవిద్యను అభ్యసించి వేర్వేరు ప్రదేశాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తున్న వైద్యులను ఒక టీమ్‌గా ఏర్పాటు చేసుకున్నట్టు తెలుస్తోంది. విశాఖపట్నంలో వైద్యులు, దళారులు పోలీసులకు చిక్కడంతో నమ్రతతో సంబంధం నడిపిన వారంతా ఇప్పుడు అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో తండాలను టార్గెట్‌గా చేసుకుని వ్యవహారాలు నడిపినట్టు తెలుస్తోంది.

ఆ డాక్టర్లు ఎవరు?

గాయత్రీనగర్‌లో ఉన్న సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్‌లో తనకు అనుకూలంగా ఉన్నవారినే వైద్యులుగా నియమించుకున్నారు. సృష్టికి కేసులను పంపిన వైద్యులకు హైదరాబాద్‌లో పలు సందర్భాల్లో విందులు ఏర్పాటు చేసినట్టు తెలిసింది. పిల్లలను తీసుకొచ్చి ఈ వైద్యులకు ఇచ్చిన ముఠాలకు డాక్టర్ నమత్ర లక్షలాది రూపాయలను చెల్లించినట్టు తెలుస్తోంది. విజయవాడ కేంద్రంగా వివిధ ఆసుపత్రులు నిర్వహిస్తున్న ఐదారుగురి వైద్యుల పేర్లు సృష్టి లింకుల్లో వినిపిస్తున్నాయి. విశాఖ ఝలక్‌తో ఈ వైద్యులకు గుండెల్లో గుబులు పుడుతోంది. ఈ వైద్యులంతా హైదరాబాద్‌లో దర్యాప్తు సాగుతున్న తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్టు తెలిసింది. గోపాలపురం పోలీసులు పూర్తిగా విజయవాడ లింక్‌లు బయటకు లాగితే ఇక్కడి ముఠాలు బయటకురావడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పాలకులకు పట్టని పోలంపల్లి

- వరదలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్
- నాడు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- నేటికీ కనీస మరమ్మతులు లేవు
- అగమ్యగోచరంలో ఆయకట్టు రైతులు



వరదలకు కొట్టుకుపోయిన పోలంపల్లి చెక్ డ్యామ్(పాత ఆనకట్ట)

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల)

వత్సవాయి మండలం పోలంపల్లి దగ్గర తెలంగాణ సరిహద్దులో 1898లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో మునేటిపై చెక్‌డ్యామ్(ఆనకట్ట) నిర్మించారు. ఈ డ్యామ్ కింద జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలోని వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాలలోని 25 గ్రామాల పరిధిలో అధికారికంగా 16,427 ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో 30 వేల ఎకరాలు సాగవుతుంది. మునేటి కాల్వ మొత్తం పొ డవు 50 కిలోమీటర్లు కాగా కాల్వలో గరిష్టంగా 396 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంటుంది. ఆయకట్టు పరిధిలో మాగాణి వరి పుష్కలంగా పండేంది. ఒక దశ లో ఆయకట్టు రైతుల జీవితాల్లో పోలంపలి వెలుగులు నింపింది. దాదాపుగా 125 సంవత్సరాల చరి త్ర ఉన్న పోలంపల్లి చెక్‌డ్యామ్ కాలగమనంలో దెబ్బతింది.

అసంపూర్తిగా కొత్త ఆనకట్ట

ఆనకట్ట పటిష్టత, సామర్థ్యం క్రమేణా క్షీణిస్తుండటంతో పాత ఆనకట్టకు దిగువన కొత్త ఆనకట్ట పనులు మొదలు పెట్టారు. కొత్త ఆనకట్ట మొదలుపెట్టి రెండు దశాబ్దాలు గడిచినప్పటికీ ఇప్పటికీ అసంపూర్తిగానే ఉంది. పైగా వివాదాల్లో కూరుకుపోయింది. ఇప్పటికీ పాత ఆనకట్ట రైతులకు సాగునీరు అందిస్తూ వస్తోంది. 2023లో వచ్చిన వరదలకు పాత ఆనకట్టకు బాగా నష్టం వాటిల్లింది. తెలంగాణా రాష్ట్రం పెద్దమండవ వైపున ఉన్న 170 మీటర్ల మట్టి కట్ట (ఎర్త్ బండ్)కు గండి పడింది. సుమారుగా 65 మీటర్ల పొడవున కట్ట కోసుకుపోయింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదు. గండిని పూడ్చి కొద్దిపాటి మరమ్మతులు చేయక ముందే గత ఏడాది సెప్టెంబరులో వచ్చిన భారీ వరదకు మిగిలిన మట్టికట్ట మొత్తం ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోయింది. ప్రధాన స్ట్రక్చర్‌తో పాటు రాళ్లతో కట్టిన కట్ట కూడా దెబ్బతింది. ప్రధాన కాల్వకు కూడా భారీ గండ్లు పడ్డాయి. దీంతో ఆనకట్ట దగ్గర నీళ్లు ఆగటం లేదు. ఎగువన ఖమ్మం జిల్లా నుంచి వచ్చే నీరంతా వచ్చింది వచ్చినట్టుగా దిగువకు వెళ్లిపోతోంది. వరద వస్తే తప్ప కాల్వకు నీళ్లు ఇవ్వలేని దుస్థితి నెలకొంది.

పోలంపల్లి చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేయకపోవడంతో మునేటి ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత వరదలకు పోలంపల్లి చెక్‌డ్యామ్, కాల్వలు దెబ్బతినడంతో సజావుగా సాగు నీరు అందే పరిస్థితి కనిపించటం లేదు. వరి నాట్లు వేసే తరుణం ఆసన్నమైనప్పటికీ చెక్‌డ్యామ్‌కు, కాల్వలకు స్వల్ప మరమ్మతులు కూడా చేయలేదు. కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలకు మోక్షం కలగటం లేదు. సాగునీరు అందుతుందన్న నమ్మకం లేక నేటికీ పలువురు రైతులు నారుమళ్లు పోయలేదు.

ఇప్పుడేం చేయాలంటే...

ప్రభుత్వం నియమించిన టెక్నికల్ అడ్వైజర్‌కమిటీ (టీఏసీ) పాత ఆనకట్టను ఇటీవల సందర్శించింది. ఆనకట్టను పటిష్టం చేయటంతో పాటు కట్ట నిర్మించటం, రైతులకు నష్టపరిహారం చెల్లించటం, ఇతరత్రా ముఖ్యమైన పనుల కోసం రూ.19.09 కోట్లు అవసరమని ప్రతిపాదనలు తయారుచేసింది. ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనందున ఇంకా నిధులు మంజూరు కాలేదు. ఒకవేళ నిధులు మంజూరైనప్పటికీ పనులు ఇప్పట్లో పూర్తికావు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయకట్టుకు సజావుగా సాగునీరు అందించాల్సి ఉంది. దీని కోసం పెద్దమండవ వైపు మునేటికి సమాంతరంగా రింగుబండ్ వేసి, నీటిని మళ్లించవచ్చునని రైతు నాయకులు సూచిస్తున్నారు.



పాత ఆనకట్ట కాల్వ గేట్లు



గిరిజన కమ్యూనిటీ హాలు మరమ్మతులకు రూ.12 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి రవీంద్ర



ఏకలవ్యుడు, అల్లూరి సీతారామరాజు, బీఆర్ అంబేడ్కర్, చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న రవీంద్ర, ఎస్పీ, జేసీ

గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం రూ 7,557 కోట్లు కేటాయించిందనిమంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కలెక్టరేట్ సమావేశపు హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఏకలవ్యుడు, అల్లూరి సీతారామరాజు, బీఆర్ అంబేడ్కర్, సేవా లాల్, చెంచులక్ష్మి, వెన్నెలగంటి రాఘవయ్య చిత్రపటాలకు మంత్రి కొల్లు రవీంద్ర, ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు, పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన అడవి తల్లికి దండాలు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, వెనుకబడిన ఆదివాసీలను జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలను, త్యాగాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముస్తాఖాన్‌పేట యానా దుల కమ్యూనిటీ హాలు మరమ్మతులకు రూ.12 లక్షల చెక్కును మంత్రి రవీంద్ర అందజేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ, ఎస్టీలు ఆధార్ నమోదు చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ హాస్టలులో 300 సీట్లు ఉంటే, 90 మంది మాత్రమే చేరారన్నారు. ఎస్టీ విద్యార్థులు పాఠశాలల్లో చేరి చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఎస్పీ ఆర్‌గంగాధర్ మాట్లాడుతూ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే తనను నేరుగా కలవాలన్నారు. ఎస్టీలకు జరిగిన అన్యాయంపై రాత పూర్వకంగా ఇస్తే చర్యలు చేపడతామన్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, మన భవిష్యత్తు కార్యక్రమం కింద జిల్లాలో 2500 మంది ఎస్టీ బాలికలను గుర్తించామని వారికి ప్రభుత్వం రూ.250 చెల్లిస్తే బాలికా సమృద్ధి యోజన పథకం వర్తిస్తుందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర చొరవ చూపాలన్నారు. జిల్లా గిరిజన శాఖాధికారి ముదిగొండ ఫణిధూర్జటి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఉయ్యూరు గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్ , ఎస్టీ సంఘాల నాయకులు నక్కా విజయబాబు, కె.శ్రీనివాసరావు, సమీర్, వీరబాబు, ఏకశిరి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. గిరిజన నాయకులను మంత్రి సత్కరించారు. మత్స్యకారులకు మంత్రి వేటకు అనుమతి పత్రాలు అందజేశారు.

రెండు చోరీ కేసుల్లో నలుగురి అరెస్టు

- బంగారం, వెండి వస్తువులు, నగదు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రెండు చోరీ కేసుల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎ.చంద్రశేఖర్ తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొండపల్లిలోని శాంతినగర్‌కు చెందిన గౌర సందీప్ తేజ, దురిశెట్టి మణికంఠ సాయి, షేక్ సుస్తాన్ మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసలై డబ్బు కోసం ఎవరూ లేని ఇళ్లను ఎంచుకొని మొత్తం నాలుగు చోట్ల చోరీలకు పాల్పడ్డారన్నారు. గత నెలలో శాతినగర్‌లో కోడె సింధు ఇంట్లో బంగారం, వెండి, నగదు అపహరించుకుపోయారన్నారు. షిరిడీ నుంచి వచ్చేటప్పటికీ బీరువా పగులకొట్టి ఉండటంతో బంగారం, వెండి వస్తువులు, నగదు చోరీకి గురైనట్లు గమనించి సింధు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దర్యాప్తు బృందాలకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వచ్చిన సమాచారం మేరకు ముగ్గురు నిందితులను ఈనెల 8న శాంతినగర్ వద్ద అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 130 గ్రాముల బంగారం, 1.300 కిలోల వెండి వస్తువులు, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పా రు. ఎన్టీటీపీఎస్‌లో ఏఈగా పని చేస్తున్న ధారావతు నాగరాజు నాయక్ ఇంట్లో చోరీకి పాల్పడిన కొండపల్లికి చెందిన తల్లపురెడ్డి ప్రతాప్ రెడ్డి అనే పాత నేరస్థుడిని ఈనెల 8న ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 300 గ్రాముల వెండి వస్తువులు, ఒక మోటార్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో క్రైమ్ ఎస్సై సేనాపతి, ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది ఆంజనేయులు, కనక కుమార్, బాజ్జి, గోపి, పూర్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న నగలు, వస్తువులు, నగదును మీడియాకు చూపుతున్న సీఐ చంద్రశేఖర్, చిత్రంలో క్రైమ్ ఎస్సై సేనాపతి, ఎస్సై విజయలక్ష్మి,

పామర్రులో ఎయిమ్స్ బ్రాంచ్

- రూ.600 కోట్లతో గుడివాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి
- పులిగడ్డ వరకు కరకట్ట ఎత్తు పెంపునకు రూ.150 కోట్లు
- ఎంపీ బాలశౌరి వెల్లడి



తోట్లవల్లూరులో కమ్యూనిటీ హాలు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరీ, ఎమ్మెల్యే కుమార్ రాజా, చిత్రంలో రావి, గురుమూర్తి

తోట్లవల్లూరు/పామర్రు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రికి అనుసంధానంగా పామర్రులో ఎయిమ్స్ బ్రాంచ్ ఏర్పాటుకు ఎయిమ్స్ డైరెక్టర్ హోదాలో తీర్మానం చేయించానని, ఇది జిల్లాలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు దోహద పడుతుందని ఎంపీ వల్లభనేని బాలశౌరీ తెలిపారు. తోట్లవల్లూరు దళితవాడలో పూర్వపు రాజ్యసభ సభ్యుడు కనకమేడ రవీంద్రకుమార్ ఎంపీ నిధులు రూ.45 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, శివారు కలాసమాలపల్లిలో ఎన్‌హెచ్‌పీసీ కంపెనీ సీఎస్‌ఆర్ నిధులు రూ.32 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన కమ్యూనిటీహాలును శనివారం ఎంపీ బాలశౌరీ, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ బాలశౌరీ మాట్లాడుతూ మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో మంచి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. జిల్లాలోని ప్రజలు అంత దూరం వెళ్లటం కష్టంగా ఉందని భావించి, శనివారం ఎయిమ్స్ బోర్డు సమావేశంలో పామర్రులో బ్రాంచ్ నిర్మాణ అంశాన్ని అజెండాలో చేర్పించానన్నారు. సీఎస్‌ఆర్ నిధులు రూ.3 కోట్లతో కేన్సర్ పరీక్షల అడ్వాన్స్‌డ్ మొబైల్ డయాగ్నోస్టిక్ యూనిట్ సేవలను తోట్లవల్లూరులో ప్రారంభించారు. కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించేందుకు అధునాతనమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు కరకట్టను రెండు అడుగుల ఎత్తు పెంచేందుకు సెంట్రల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నుంచి రూ.150 కోట్లు మంజూరు చేయిస్తానన్నారు. కంకిపాడు నుంచి గుడివాడ వరకు రోడ్డు రెండు వైపులా భూమిని సేకరించి కొత్తగా గ్రీన్ ఫీల్డు కింద రూ.600 కోట్లతో ఆరు లేన్ల రోడ్డుని నిర్మించేందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరి ఆమోదం తెలిపారన్నారు. ఇది చారిత్రాత్మకమని బాలశౌరీ పేర్కొన్నారు. పాములలంక బ్రిడ్జికి నాబార్డు నుంచి నిధులు తెచ్చే బాధ్యత తీసుకుంటున్నట్టు హామి ఇచ్చారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతు బాలశౌరీ లాంటి డైనమిక్ ఎంపీ మనకుండటం అదృష్టమన్నారు. ప్రతి అభివృద్ధిలో ఆయన ముద్ర ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, గ్రామ సర్పంచ్ పెనుముత్స రాధిక, జనసేన నేతలు తాడిశెట్టి నరేష్, ఎస్ కృష్ణ సుమన్, రామినేని కుటుంబయ్య, నెక్కలపూడి మురళీ, చొప్పరపు సుబ్రహ్మణ్యం, వీరంకి పరశురామ్, ఎంపీడీవో రవికాంత్, పీఆర్ డీఈ సురేష్‌బాబు, ఏఈ శరాబంది రాజు, డాక్టర్ టి.సాయిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కీచక టీచర్లు

(5వ పేజీ తరువాయి)

అంశాలపై అధికారులు సలహాలు తీసుకుంటున్నారు. సాధారణ సమస్యలు తెలుస్తాయనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఈ సోషల్ ఆడిట్‌లో భయంకరమైన నిజాలు బయటపడుతున్నాయి.

హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం

ఆడిట్ జరిగిన ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో ఇటీవల విజయవాడలో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారీగా జరిగిన పలు అకృత్యాలను ఆడిట్ బృందం వివరించింది. ఆయా హెచ్‌ఎంలను హెచ్చరించింది. కీచక ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎంలు తెలిపారు. ఇంకా ఎంతోమంది విద్యార్థినులు కీచక ఉపాధ్యాయుల చేతిలో నలిగిపోతున్నారో తెలియాల్సి ఉంది.

కాగా, ఆడిట్ బృం దాలు కొందరు విద్యార్థుల బ్యాగులు, జేబులు పరిశీలించగా, గుట్కా ప్యాకెట్లు, సిగరెట్లు కనిపించాయి. వ్యసనాలకు అలవాటు పడిన కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులతోనే మద్యం, గుట్కా ప్యాకెట్లు, సిగరెట్లు తెప్పించుకున్నట్లు కూడా తెలిసింది. ఆ అంశాన్ని అలుసుగా తీసుకుని విద్యార్థులు కూడా ఆ అలవాట్లు చేసుకుంటున్నారని సమాచారం.

కీచకులకు అండదండలా?

పాఠశాలల్లో కీచక వ్యవహారాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై అధికారులు ఉదాసీనంగా ఉండడానికి కొన్ని ఉపాధ్యాయ సంఘాలు కూడా కారణమని తెలుస్తోంది. కీచక ఉపాధ్యాయులు చేస్తున్న చేష్టలు తెలిసినప్పటికీ ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉన్నతాధికారులు చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఏదైనా అంటే.. సంఘాలు వెనుకేసుకొస్తాయన్న భయంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆడిట్‌లో బయటపడిన కీచక ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి పనులు ఎవరూ చేయకుండా చూడాల్సిన అవసరం ఉంది.

ఎరువు.. కరువు

(5వ పేజీ తరువాయి)

జారీ చేస్తున్నారు.

రైతుల ఇబ్బందులు

పంట ఎదుగుదలకు అత్యవసరంగా వాడే డీఏపీ, యూరియాను వివిధ కంపెనీలు మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయి. ఏదోలా తమ వద్ద మిగిలి ఉన్న జింక్, దుబ్బు గుళికలు, వేపపిండి వంటి మిశ్రమ ఎరువులను అమ్ముకునేందుకు యూరియాతో లింక్ పెట్టి ప్రైవేట్ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో ఎరువులు అవసరానికి తగ్గట్టుగా సరఫరా లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా జిల్లావ్యాప్తంగా యూరియా ఎక్కడా అందుబాటులో లేకపోవడంతో రైతులు రోడ్డునపడ్డారు. గుడివాడ డివిజన్ పరిధిలోనూ ఇదే పరిస్థితి. రూ.266కు అమ్మే యూరియా రూ.400 పెట్టినా దొరకని పరిస్థితి ఏర్పడింది.

సొసైటీల్లో యూరియా మాయం

గుడివాడ మండలం మోటూరు సొసైటీకి వచ్చిన డీఏపీ లారీని కూటమి నాయకులు, బడా రైతులు, ఆక్వా రైతులు రాత్రికి రాత్రే తరలించేశారు. చల్లపల్లి ప్రాంతంలో పరిస్థితి దారుణంగా ఉంది.

గుడివాడకు కూతవేటు దూరంలో ఉన్న ముదినేపల్లి మండలం పెదపాలపర్రు సొసైటీ నుంచి యూరియాను స్థానిక టీడీపీ నాయకులు, బడా రైతులు మాయం చేసేశారు. బయట గ్రామాల రైతులకు, వ్యక్తులకు ఎరువుల అమ్మకాలు చేపట్టొద్దని కూటమి నాయకులు, సొసైటీ సిబ్బంది, బడా రైతులు తీర్మానం చేసినట్లు సమాచారం.

ఇదే తరహాలో జిల్లాలోని మిగిలిన సొసైటీలు కూడా తమతమ గ్రామాల పరిధిలోని రైతులకే అమ్మకాలు చేయాలనే తీర్మానాలకు సిద్ధపడుతున్నట్లు తెలిసింది.

యూరియాను అమ్మబోం : రాష్ట్ర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్

లింకు లేకుండా యూరియా కావాలని రిటైల్ వ్యాపారులు కోరుతున్నప్పటికీ కుదరదని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. వేపపిండి లింకుతో కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని ఇటీవల స్పిక్ కంపెనీ ప్రతినిధులు తేల్చిచెప్పారు. దీంతో వేపపిండిని ఏం చేసుకోవాలో తెలియక గుడివాడ పరిసర ప్రాంత హోల్‌సేల్ డీలర్లు యూరియా కొనుగోలుకు నో చెప్పారు. అవనిగడ్డలోని ఒక హోల్‌సేల్ డీలర్ కంపెనీ షరతులకు లోబడి యూరియాను కొన్నట్లు సమాచారం. మరో కంపెనీ అయితే ఏకంగా యూరియా సరఫరా కాక మునుపే ఒక హోల్‌సేల్ డీలర్‌కు రూ.25 లక్షలు విలువైన గుళికల బిల్లు చేసినట్లు సమాచారం. ఇటువంటి షరతులతో తాము యూరియా అమ్మకాలను చేయలేమని, చేపట్టబోమని రాష్ట్ర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్ల అసోసియేషన్ తేల్చిచెప్పింది.

పెనమలూరు

● పెనమలూరు ● గన్నవరం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

వైభవంగా లక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్ఠ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : లోకకళ్యాణార్థం కాకులపాడులో శ్రీలక్ష్మీనారాయణ విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణం వైభవంగా నిర్వహించారు. కాకులపాడు చెరువుగట్టుపై త్రిపురనేని సుబ్బారావు నాటిన వేప, రావి చెట్టు వద్ద శనివారం ఉదయం గణపతి హోమం నిర్వహించి వేదమంత్రాల మధ్య త్రిపురనేని సత్యనారాయణ, లక్ష్మీపద్మావతి దంప తులు శ్రీలక్ష్మీనారాయణ విగ్రహాలను ప్రతిష్ఠించారు. త్రిపురనేని శ్రీధర్, చలసాని పూర్ణబ్రహ్మయ్య దంప తులు, కామినేని హరిబాబు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.





విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల విద్యా అవసరాలు తీర్చడానికి మానవత విద్యా నిధిని ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మానవత కార్యాలయంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిని వై.జ్ఞానశ్రీకి మానవత జంక్షన్ శాఖ రూ.7,500లు ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థినికి కోటేశ్వరరావు చేతులు మీదుగా సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వడ్డి రాజేశ్వరరావు, గంటా సత్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, పీవీ చలం, ఇందిరాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రం (శ్రవణా నక్షత్రం) పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో వై.శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు అభిషేకాలు నిర్వహించారు. శనివారంతో పాటు జన్మనక్షత్రం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కాకాని అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కానూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ ఇండస్ట్రియల్ సీ బ్లాక్ కానూరు సెక్షన్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు న్యూ ఆటోనగర్ సీ బ్లాక్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గణదల విద్యుత్ ఈఈ పి. హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీకి వెల్లంకి రాజీనామా

ఉయ్యూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కలవపాముల పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్, టీడీపీ సీనియర్ నాయకుడు వెల్లంకి సురేంద్రరావు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. కలవపాములలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 40 సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తూ, అభివృద్ధికి కృషి చేసిన తనకు తగిన గుర్తింపు లేదని, పార్టీకి ఏవిధంగా ఉపయోగపడని వారికి పదవులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా రెండు సార్లు పనిచేసిన తనకు గుర్తింపు లేకపోవడంతో పార్టీలో ఇమడలేక సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. తన భవిష్యత్ ప్రణాళికను త్వరలోనే ప్రకటిస్తానన్నారు.

సారూ.. వ్యర్థాలు తొలగించరూ

- అంగన్వాడీకేంద్రం పక్కనే డ్రెయిన్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు
- మురుగునీటితో దుర్వాసన ● ఇబ్బందిపడుతున్న చిన్నారులు

కానూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కానూరు మెయిన్‌రోడ్డుకు కూతవేటు దూరంలో ఎస్‌బీఐ కాలనీలోని అంగన్వాడీ ప్రీప్రైమరీ స్కూల్ వద్ద డ్రెయినేజీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి దుర్వాసన కొడుతోంది. పేరుకుపోయిన వ్యర్థాల వల్ల మురుగునీరు ముందుకు వెళ్లక అక్కడే నిలిచి దోమలు, ఈగలకు నిలయంగా మారింది. దీంతో అక్కడే అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో చదివే విద్యార్థులు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. దీనిపై తాడిగడప మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.



అంగన్వాడీ కేంద్రం వద్ద డ్రెయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



మహిళకు వినికిడి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

వినికిడి సమస్యకు జాగ్రత్తలు తీసుకోవాలి

- కాక్లియర్ ఇంప్లాంట్ నిపుణులు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల్లో వయస్సు రీత్యా వినికిడి సమస్యతో పాటు యువత ఇయర్‌ఫోన్స్ ఎక్కువగా వాడటం వల్ల వినికిడి సమస్యలెదుర్కొంటున్నారని, వినికిడిలో సమస్య గుర్తించిన వెంటనే తగు జాగ్రత్తలు తీసుకుంటూ వైద్యులను సంప్రదించాలని కాక్లియర్ ఇంప్లాంట్ నిపుణుడు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు సూచించారు. బొమ్ములూరులో శనివారం శ్రీసీతారామస్వామి దేవస్థాన ట్రస్ట్, ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్లోక కోవి (యూఎస్ఏ) సహకారంతో రాధికరాయుడు స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులతో వినికిడి, చెవి సంబంధించిన సమస్యలపై అవగాహన సదస్సు, వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రాయుడు ఆధ్వర్యంలో ఆడియాలజిస్ట్ డాక్టర్ శ్రీనునాయక్, రాధికరాయుడు ఆసుపత్రి సిబ్బంది 213మందికి వినికిడి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ముసునూరు కాశీ విశ్వేశ్వరరావు, శశిధర్ కోవి, కొల్లి చందు, తదితరులు పర్యవేక్షించారు.



ఎగ్జిబిషన్ సందర్శించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, వైద్యులు

ఆరోగ్యంపై అవగాహన కల్పించటమే ధ్యేయం

గన్నవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంపై అందరికీ అవగాహన కల్పించడమే ధ్యేయమని కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో కళాశాలలో 6వ రోజు మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్‌ను 3వేల మంది విద్యార్థులు సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ మాట్లాడుతూ, హెల్త్, మెడికల్ ఎగ్జిబిషన్లకు ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్ కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. కళ్యాణి శ్రీ, హెచ్‌వోడీలు ఏవోలు, పాల్గొన్నారు.

● డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఎక్స్‌ప్లోర్-25 పేరిట 6వరోజు ఎగ్జిబిషన్‌ను వేలాది మంది సందర్శించారు. ప్రిన్సిపాల్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో దంత వైద్యంలో 9 విభాగాలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా సందర్శకులకు వైద్యులు దంతాల ప్రాముఖ్యత వివరించారు. ఏవో వై.మధుసూధనరావు హెచ్‌వోడిలు డాక్టర్ కాళేశ్వరరావు, అజయ్ బెనర్జీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో, వైద్యాధికారులు

జాతీయ నులిపురుగుల నివారణ

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎంపీడీవో ఇ.సత్యకుమార్

ఉంగుటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనే ధ్యేయంగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈనెల 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ నుంచి సరఫరా చేసిన ఆల్బెండజోల్ మాత్రలను ఎంఈవో జె.సాంబశివరావు, వైద్యాధికారులతో కలిసి ఆయన పాఠశాలల సీఆర్పీలు, పారామెడికల్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్ల(గోడపత్రికల)ను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఇందుపల్లి, ఆత్కూరు, పెదఅవుటపల్లి, ఉంగుటూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ బి.శిరీష, డాక్టర్ టి.జితేంద్రకుమార్, డాక్టర్ కరీముల్లా మొహినుద్దీన్, డాక్టర్ విజయ్‌ప్రదీప్, ఎంపీహెచ్‌ఈవోలు, జి.రత్నబాబు, జీవకాంత్‌రాజు, శివరామకృష్ణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క, పూడిక తొలగింపు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రామన్నగూడెం, రంగయ్యప్పారావుపేట గ్రామాల్లోని పంట పొలాలు అధికవర్షాలకు ముంపునకు గురవ కుండా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో ముందస్తుగా గుర్రపు డెక్కను తొలగిస్తున్నట్లు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ తెలిపారు. రామన్నగూడెం వద్ద బుడమేరులో కలిసే వరదనీటి కాలువలో గుర్రపుడెక్క, పూడికతీత పనులను శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రామన్నగూడెం సర్పంచ్ రెడ్డి వీరాంజనేయులు, వైస్ చైర్మన్ నల్లిబోయిన గోపాలకృష్ణ, మున్నంగి బాబూరావు, కొల్లిపర కిషోర్, నల్లిపోయిన శ్రీనివాసరావు తదితర రైతులు పాల్గొన్నారు.



కాటూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఉయ్యూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం కాటూరు బీసీ కాలనీలో పర్యటించి సూపర్‌సిక్స్ సంక్షే మ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారని. దీపం పథకం ద్వారా ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తున్న చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సజ్జా మధు, సీనియర్ నాయకుడు వేమూరు శ్రీనివాసరావు, కోడె హరీశ్, శరత్, యుగబాబు, చీలి సుధాబాబు, ఫిలిప్ పాల్గొన్నారు.

ఘనంగా సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినం

కంకిపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలు కంకిపాడులోని విజయలక్ష్మీ థియేటర్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు షేక్ అజ్గర్ షరీఫ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇబ్రహీం, అన్సర్, సోలో తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్యపరీక్షలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజానీకానికి మెరుగైన అన్ని రకాల వైద్యసేవలు అందించడానికి గ్రామీణ ప్రాంత వైద్యశాలలు కృషి చేయాలని గొల్లపల్లి శ్రీరఘునాథస్వామి దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్ అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని నందిని హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుంకర సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథిగా విచ్చేసి శిబిరం ప్రారంభించారు. 150 మందికి పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేసినట్లు ఆసుపత్రి వైద్యులు పి.శివ రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు నడిమింటి బలరామకృష్ణ, సుధ, కాశీ విశ్వనాథ్, యువప్రశాంతి, మొవ్వా కల్యాణ్ వెంకటేశ్వర్లు, హేమేశ్వరావు, అరవింద్, శశికాంత్, కడియాల కాశీఅన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వేలేరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై కారు ఢీకొన్న ప్రమాదంలో మతిస్థిమితం లేని వక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారు ఝామున జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై వేలేరు అడ్డరోడ్డు వద్ద గల ఇండియన్ ఆయిల్ బంక్ దగ్గరలో మతిస్థిమితంలేని వ్యక్తి రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి ఏలూరు వైపునకు వెళుతున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతని తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వేలేరు వీఆర్‌వో కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఆడబిడ్డలకు అండగా ఉంటా

రక్షాబంధన్ వేడుకల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



యార్లగడ్డకు రాఖీలు కట్టిన తెలుగు మహిళలు.. పోలీసులకు రాఖీ కడుతున్న సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ప్రసాదంపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని తెలుగు మహిళలు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు రాఖీలు కట్టారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చిన తెలుగు మహిళలు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. తమకు అండగా ఉండాలని కాంక్షిస్తూ యార్లగడ్డకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి పండుగ జరుపుకున్నారు. నియోజకవర్గంలోని మహిళలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉండి ఆదుకుంటానని యార్లగడ్డ భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా గన్నవరం నియోజక వర్గ అధ్యక్షురాలు, ముస్తాబాద్ పీఏసీఎస్ చైర్‌పర్సన్ మేడేపల్లి రమ, విజయవాడ రూరల్ మండల అధ్యక్షురాలు నెక్కంటి శ్రీదేవి, ఉంగు టూరు మండల సెక్రటరీ గుడ్డేటి సుమతి, గన్నవరం మండలం ఎమ్మెస్ ప్రెసిడెంట్ కోనేరు రామ మణి, బొడపాటి శ్రీదేవి, నువ్వుల ప్రమీల, అన్నే ధనలక్ష్మి, బొడపాటి కవిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

కానూరు : కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శనివారం రాఖీ పండుగను సేవా దృక్పథంతో ఘనంగా జరుపుకున్నారు. పోరంకి లోని ఉల్లూరిపల్లి నవరత్నమ్మ అనాథ ఆశ్రమాన్ని సందర్శించి అక్కడ అనాథ పిల్లలకు రాఖీలు కట్టి మిఠాయిలు, బహుమతులు అందజేశారు. పెనమలూ రు ట్రాఫిక్ పోలీసులకు, మున్సిపల్ కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు రాఖీలు కట్టి రక్షాబంధ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ వెంక టేశ్వరరావు, ప్రో వీసీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవి చంద్‌లు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వాలంటీర్లతో పాటు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శివ రామ్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : అన్నాచెల్లెలు, అక్క తమ్ముల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీపౌర్ణమిని శని వారం ఉయ్యూరు, మండల పరిధిలో ఆనందోత్సాహ లతో జరుపుకున్నారు. అన్నదమ్ములకు అక్కచెల్లెల్లు రాఖీలు కట్టి రక్షాబంధన్ చేసి ఆశీర్వచనాలు పొం దారు. రాఖా పౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలో రాఖీ దుకాణాల వద్ద రాఖీలు కొనేందుకు వచ్చిన వారితో కిటకిటలాడాయి. పలువురు ప్రముఖులకు మహిళలు రాఖీలు కట్టి రక్షా బంధన్ చేశారు.

కంకిపాడు : ప్రతికష్టంలో తోబుట్టువలకు తోడుగా సోదరులు ఉంటారన్న విశ్వాసంతో ఈ రక్షా బంధన్ వేడుకల దేశ వ్యాప్తంగా ఎంతో వైభవంగా నిర్వహిస్తుంటారు. సోదర, సోదరీమణులు మధ్య అనుబంధాన్ని ఈ పండుగ గుర్తుచేస్తుంది. సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి జీవితంలో ఉన్నత స్థానా లకు చేరుకోవాలని, ఎల్ల వేళలా అండగా రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గౌరవంతో కూడిన నమ్మకమైన సోదర బంధానికి ప్రతీక రక్షాబంధన్ అని సర్పంచ్ కసుకుర్తి రంగామణి అన్నారు. రంగన్నగూడెంలో శనివారం రాఖీపౌర్ణమి (రక్షాబంధన్) సందర్భంగా ఎన్ ఎస్ఎల్పీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణకు రాఖీ కటి మిఠాయి తినిపించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా రంగామణికి గోపాలకృష్ణ, మణికృష్ణ దంపతులు నూతన వస్త్రాలను బహూకరించారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణకు రాఖీ కడుతున్న సర్పంచ్ రంగామణి



ఉయ్యూరు .. నున్న.. కంకిపాడులో రక్షాబంధన్ వేడుకలు



మొక్కకు నీరు పోస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని

ఎయిమ్స్‌లో మరిన్ని వైద్య సదుపాయాలు

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్‌లో పేదలకు అందుబాటులో ఉండేలా మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని విజయవాడ ఎంపీ, మంగళగిరి ఎయిమ్స్ పాలక మండలి సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. శనివారం మంగళగిరి ఎయిమ్స్ 11వ గవర్నింగ్ బాడీ సమావేశం ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ కేశినేని చిన్ని, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు మరిన్ని సౌకర్యాలు చేపట్టాలని సూచించారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండేలా ఎక్కువ మంది వైద్యులు, సిబ్బంది ఉండాలన్నారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉంటే పై అధికారులతో మాట్లాడి నియమించుకోవాలని సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ నేషనల్ హైవే-16 పక్కన ఉన్నందున రోడ్డు ప్రమాద బాధితుల కోసం అత్యవసర ట్రామా విభాగం నెలకొల్పాలన్నారు. దీంతో ప్రమాద బాధితులకు వెంటనే సరైన వైద్యం అందే అవకాశం ఉందన్నారు. తొలుత హాస్పిటల్ ప్రాంగణంలో ఎంపీ చిన్ని మొక్క నాటి నీరు పోశారు. ఈ సమావేశంలో పలువురు ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల అదృశ్యం



నందిగామ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తలు అదృశ్యమైన ఘటన నందిగామలో చోటు చేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం, పెంట్యాలవారిగూడెంకు చెందిన పెంట్యాల లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు నందిగామ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనారాయణ పెద్దకుమారుడు కిషోర్ తన కుటుంబంతో నందిగామలో నివాసముంటున్నాడు. భార్య ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తుంది. వ్యాపారంలో నష్టాలు రావడంతో కిషోర్ అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే పరిస్థితి లేక ఇబ్బంది పడుతున్న తన కుమారుడు భార్యాపిల్లలతో కలిసి ఈనెల 6న మంగళగిరిలో ఉంటున్న తన బావమరిది ఇంటికి వెళ్లాడు. ఆరోజు అక్కడే ఉండి మరుసటి రోజు సాయంత్రం పిల్లలను అక్కడే విడిచి బయలుదేరారు. ఇప్పటి వరకూ వారి ఆచూకీ లభించలేదు. ఫోన్‌లు కూడా లేకపోవడంతో వారెక్కడున్నది తెలియడం లేదు. లక్ష్మీనారాయణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు రోజులుగా ఇంట్లోనే యువకుడి మృతదేహం

● దుర్వాసన రావడంతో గుర్తించిన ఇంటి యజమాని

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరపేట ప్రాంతంలోని ఓ ఇంట్లో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇది 5 రోజులపైనే అవుతున్నా ఎవరూ గుర్తించలేదు. కింద పోర్షన్ నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని గమనించి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం పాల్వంచకు చెందిన వేమూరి రవిచంద్ర (28) ఆన్‌లైన్‌లో జిమ్ కోచింగ్ పనిచేస్తుంటాడు. నగరంలోని రామలింగేశ్వరపేట ప్రాంతంలో బాబాయి ఉండటంతో అతడి వద్దకు వచ్చాడు. కొన్ని రోజులు బాబాయి ఇంట్లో ఉన్న తరువాత అదే ప్రాంతంలోని 3వ లైన్‌లో ఓ ఇంట్లో కింద పోర్షన్‌లో అద్దెకు దిగాడు. ఈ నేపథ్యంలో శనివారం కింది పోర్షన్ నుంచి తీవ్రమైన దుర్వాసన రావడం, పైగా రవిచంద్ర వారం నుంచి కనిపించకపోవడంతో అనుమానం కలిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు రవిచంద్ర ఉంటున్న ఇంటి తలుపులు తెరచి చూడగా రవిచంద్ర చనిపోయి కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రవిచంద్ర కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని పోలీసుల విచారణలో తేలింది. ఈ కారణంగా మృతి చెంది ఉంటాడని వారు భావిస్తున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గూడవల్లి నర్సయ్య

ప్రసాదంపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గన్నవరం అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గూడవల్లి నర్సయ్య, గౌరవ చైర్మన్‌గా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, వైస్ చైర్మన్‌గా కొండేటి వెంకటేశ్వరరావుతో పాటు 17 మందిని సభ్యులను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ బీ రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలి

● డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు

గాంధీనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్టీల్లోని 35 తెగల సమగ్ర స్థితిగతుల కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత ఆదివాసీ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం జాతీయ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. గిరిజనులుగా పిలువబడే ఆదివాసీల విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగం, ఆరోగ్యం తదితర రంగాల్లో వారి స్థితిగతులపై సమగ్రంగా సమీక్షించుకున్నారు. ప్రముఖ ఆదివాసీ నేత కటారి కోటేశ్వరరావు, సంఘం జాతీయ జాయింట్ సెక్రటరీలు పాల భోగేశ్వరరా వు, కందుల వెంకటేశ్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గంటిమళ్ల సత్తిబాబు, సాంబశివరావు పాల్గొన్నారు. జాయి దేవకొండ సాంబశివరావు, కటారి కోటేశ్వరరావు, రమేష్ నాయక్, పాల భోగేశ్వరరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎన్నికల డిజిటల్ డేటాను బహిర్గతం చేయాలి

● కాంగ్రెస్ నేత భార్గవ్ డిమాండ్

విజయవాడ సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ పూర్తి డిజిటల్ డేటాను బహిర్గతం చేయాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషన్ విభాగం అధ్యక్షుడు వల్లూరి భార్గవ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల వివరాలను బహిర్గతం చేస్తే పారదర్శకత పెరుగుతుందన్నారు. దేశంలోని కొన్ని నియోజకవర్గాల్లో జరిగిన ఓట్ల దోపిడీపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బహిర్గతం చేసిన సందర్భంలో ఎన్నికల సంఘం తన నిజాయితీని నిరూపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైసీపీకి నిజంగా ఓట్ల దోపిడీ జరిగిందని నమ్మకముంటే, ఆపార్టీ నేతలు ముందుకొచ్చి పోరాటం చేయాలన్నారు.

ఏపీఆర్‌జేసీలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

పామర్రు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నిమ్మకూరులోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 5, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మండలి బ్రాహ్మణేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో బాలురు ఓసీ 4 సీట్లు, సీఏపీ 1, పీహెచ్‌సీ 1 సీట్లతోపాటు ఎనిమిదో తరగతిలో బీసీ బాలికలకు మాత్రమే ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల14 తేదీ సాయంత్రంలోగా నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో దిగువ తరగతుల్లో చదివి ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆదాయ పరిమితి ఏడాదికి రూ.లక్షకు మించి ఉండరాదన్నారు. తెలుపు రేషన్ కార్డుదారులు ప్రవేశాలకు అర్హులన్నారు. సైనికోద్యోగుల పిల్లలకు ఈ నియమం వర్తించదన్నారు.

క్రూయిజర్స్ హోరు.. కుర్రకారు జోరు..!

విజయవాడ కేంద్రంగా షోరూమ్‌ల ఏర్పాటు

● హార్లే డేవిడ్‌సన్, బీఎండబ్ల్యూ, కవాసాకి కంపెనీల బైక్స్ ఇక్కడే !
● రాష్ట్రమంతటా ఇక్కడి నుంచే అమ్మకాలు ● బెజవాడలోనే సర్వీస్ సెంటర్స్

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: విజయవాడ క్రూయిజర్ బైక్స్ అమ్మకాలకు ప్రధాన కేంద్రంగా మారింది. రాష్ట్రంలోనే ఒక్క విజయవాడలోనే ఇలాంటి షోరూమ్‌లు ఏర్పాటయ్యాయి. ఈ బైక్స్ కొనుగోలుకు జనం క్యూ కడుతున్నారు. ఒకప్పుడు పట్టణ యువత మాత్రమే ఆసక్తి చూపగా, ఇప్పుడు గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా ఖరీదైన క్రూయిజర్ బైక్స్‌పై మోజు పెంచుతున్నారు. ప్రతి షోరూమ్ నెలకు 25 బైక్‌లను విక్రయిస్తోంది. ఏడాదిగా అమ్మకాలు ఆశాజనకంగా ఉండటంతో విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. లగ్జరీ కారుకు మించిన ధర ఉన్నప్పటికీ, యువత వీటిని కొనేందుకు వెనుకాడటం లేదు. ఒంటరిగా ప్రాంతాలను చుట్టడం, వేగంగా, సురక్షితంగా



గమ్యం చేరాలనే ఆలోచన ఉన్న యువతను ఈ బైక్స్ ఆకట్టుకుంటున్నాయి. హెవీ ఇంజన్, హై కెపాసిటీ, ఏబీఎస్ బ్రేక్ సిస్టమ్, రేసింగ్ కంఫర్ట్, యూనిక్ హ్యాండిల్, వీ ట్విన్ ఇంజన్లు, కస్టమైజేషన్ సౌలభ్యం వీటి ప్రత్యేకతలు. రైడర్ గుండె చప్పుడుకు కనెక్ట్ అయ్యేలా తయారైన ఈ బైక్స్ విజయవాడలో అమిత ఆదరణ పొందుతున్నాయి. ఆటోమొబైల్ హబ్‌గా ఉన్న విజయవాడలో హార్లే డేవిడ్‌సన్, కవాసకీ, బీఎండబ్ల్యూ షోరూమ్‌లు ఉన్నాయి. రాష్ట్రంలో ఇతర చోట్ల సర్వీస్ సెంటర్స్ లేవు, విజయవాడ నుంచే రాష్ట్రమంతా సరఫరా జరుగుతోంది. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలకు కూడా ఈ క్రేజ్ విస్తరించింది. రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు కూడా యువతతో పాటు మధ్య వయస్కుల్లోనూ ఆదరణ పెరుగుతోంది. హార్లే డేవిడ్‌సన్ బైక్ కొనుగోలు చేసిన వారు ఆటోమేటిక్‌గా 'హెచ్‌వోజీ' వాట్సాప్ గ్రూపులో చేరతారు. ఈ గ్రూపు దక్షిణ భారత యాత్రలు, రాష్ట్ర, దేశ, ప్రపంచ యాత్రల కోసం ఏర్పాటైంది. సభ్యులు పరిచయం చేసుకుని, యాత్రలు ప్రారంభిస్తారు. హిమాలయాల యాత్ర, స్వాతంత్ర్య దినోత్సవ యాత్రలు వంటివి జరుగుతాయి.



హార్లే డేవిడ్‌సన్ షోరూమ్ వద్ద ఏర్పాటు చేసిన క్రూయిజర్ బైక్



బీఎండబ్ల్యూ..



కవాసకీ...

సవారీ కోసం హార్లీ..

హార్లే బైక్స్ ధరలు చూస్తే హెచ్ 440 (440 సీసీ) రూ.2.39 లక్షలు, నైట్‌స్టార్ (975 సీసీ) రూ.17లక్షలు, స్పోర్ట్స్ స్టార్ (1250 సీసీ) రూ.20 లక్షలు, ఫాట్ బాబ్ (1250 సీసీ) రూ.39లక్షలు, ఫాట్ బాయ్ రూ.32 లక్షలు, సాఫ్ట్ టూర్ రూ.45 లక్షలు. నెలకు సగటున 25 బైక్స్ విక్రయమవుతున్నాయి.

కవాసకీ బైక్స్

క్రూయిజర్స్ అమ్మకాల్లో ఇది కూడా అగ్ర స్థానంలో ఉంది. విజయవాడ షోరూమ్ నుంచి నెలకు 30 బైక్స్ విక్రయమవుతున్నాయి. ధరలు: డబ్ల్యూ175 (174 సీసీ) రూ.1.22 లక్షలు, ఎక్స్ 300 (296 సీసీ) రూ.3.75 లక్షలు, నింజా 650 (649 సీసీ) రూ.7.27 లక్షలు, నింజా 4ఆర్‌ఆర్ (399 సీసీ) రూ.9.42 లక్షలు, జెడ్‌హెచ్2 (998 సీసీ) రూ.23.48 లక్షలు, నింజాఎస్‌ఈ (998 సీసీ) రూ.32.95 లక్షలు.

బీఎండబ్ల్యూ టూర్ ట్రిప్ పార్టీస్

బీఎండబ్ల్యూ అమ్మకాలు నెమ్మదిగా ఉన్నాయి. 310 సీసీ స్పోర్ట్స్ వేరియంట్ రూ.3.98 లక్షలకు అందుబాటులో ఉంది. ఎఫ్ 900 (90 సీసీ) రూ.18 లక్షలకు హైదరాబాద్ నుంచి సరఫరా అవుతోంది. ఈ ఏడాది సంక్రాంతి వరకు అమ్మకాలు జరిగాయి, ఆ తర్వాత ఆరు నెలల్లో అమ్మకాలు లేవు. అమ్మకాలు పెంచేందుకు టూర్ ట్రిప్ పార్టీలు నిర్వహిస్తున్నారు. త్వరలో స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు.

హత్యకు వచ్చి చైన్‌స్నాచింగ్

● జగ్గయ్యపేట, నందిగామ వరుస చోరీల్లో కొత్త కోణం
● సీసీ కెమెరాల ఆధారంగా సుపారీ గ్యాంగ్ నిందితుల గాలింపు
● వారం రోజుల్లోనే చేధించిన ఎస్సై రాజు



జగ్గయ్యపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట, నందిగామలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ముగ్గురు నిందితులను జగ్గయ్యపేట ఎస్సై రాజు శనివారం అరెస్టు చేశారు. పేటలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు వచ్చి అతడు దొరక్కపోవటంతో అతడు బైక్‌ను ఎత్తుకెళ్లిన నిందితులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడటం విశేషం. చైన్ స్నాగింగ్ కోసం దర్యాప్తు చేసిన పోలీసులకు ఈ సుపారీ విషయం వెల్లడైంది. నిందితుల నుంచి నందిగామ, జగ్గయ్యపేటలో చోరీ చేసిన రూ.6.50 లక్షల విలువైన 82 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఈ నెల 1న జగ్గయ్యపేటకు చెందిన గింజుపల్లి కరుణ, పూర్ణచంద్రరావు దంపతులు టీవీఎస్ ఎక్సెల్‌పై బంధువుల పరామర్శకు వెళ్లి వస్తుండగా అదేమార్గంలో పల్సర్ బైక్‌పై వచ్చిన అగంతకులు చిల్లకల్లు దాటాక వెనుక నుంచి జగ్గయ్యపేట రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద మెడలో చైన్ తెంపుకుని పరారయ్యారు. పూర్ణచంద్రరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన ఎస్సై జీ రాజు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సీఐ వెంకటేశ్వర్లు సూచనలు, ఉన్నతాధికారుల సహకారంతో విచారణ ప్రారంభించారు. మంగళగిరికి చెందిన గొల్ల గోపీ కొంతకాలంగా పేట పట్టణ శివారు ధనంబోడు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. పెనుగంచిప్రోలు మండలం నవాబుపేటకు చెందిన వేముల తిరుపతిరావు ఆటో తోలుతుండగా పరిచయమైంది. చెరువు బజార్‌కు చెందిన తన బావ తానూరి శ్రీనును హత్య చేసిన బత్తుల కిశోర్‌బాబుపై ప్రతీకారంగా హత్య చేసేందుకు గోపీ తన మిత్రులు మంగళగిరి మండలం కొత్తపేటకు చెందిన మచ్చ వెంకటేష్ (32), లక్ష్మీనరసింహకాలనీకి చెందిన పఠాన్ సలీంబాషా (30)తో ఒప్పందం కుదుర్చుకున్నారు. నెల క్రితం బత్తుల కిశోర్ బాబు ఇంటికి వెళ్లి రెక్కీ నిర్వహించారు. కిశోర్ లేకపోవటంతో అతడి పల్సర్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి బైక్‌పై తిరుగుతూ ప్లాన్ వేస్తున్నారు. ఆ పథకం పారక ముందు నందిగామ తర్వాత జగ్గయ్యపేటలో ఒకేరోజు వరుసగా మూడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి పోలీసులకు సవాల్ విసరటంతో టెక్నాలజీ, సీసీ కెమెరాల ఆధారంగా శోధించిన ఎస్సై రాజుకు వారు దొరికిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సలీం బాషాపై తాడేపల్లి, ఆత్కూరు పోలీస్ స్టేషన్లలో 9 కేసులుండగా, మచ్చ వెంకటేష్‌పై చీరాల, తాడేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో 7 కేసులు, హత్యకు సఫారి మాట్లాడిన వేముల తిరుపతిరావుపై పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు చెప్పారు. బత్తుల తిరుపతిరావుతో స్నేహంతో గోపి కిశోర్ హత్యకు పాత స్నేహితులతో సుపారి మాట్లాడాడు. గోపీ పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 21 రోజుల రిమాండ్ విధించిందని ఎస్సై తెలిపారు. కాగా బత్తుల కిశోర్ చెరువుబజార్‌లో పూజారి హత్య కేసులో కండీషన్ బెయిల్‌పై పోలీస్ స్టేషన్‌కు వస్తున్నా బైక్ పోయిన విషయంపై ఫిర్యాదు చేయకపోవటం విశేషం.



ఆదివాసి దినోత్సవంలో డాన్స్ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ ఎమ్మెల్యే కొలికపూడి తదితరులు

చదువుకు లేదు పేదరికం

ప్రతి గిరిజన విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలి: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఎ.కొండూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి గిరిజనుడు, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఎ.కొండూరు అడ్డరోడ్డు సమీపంలోని గిరిజన సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల సాధనకు అవగాహన కల్పిస్తునట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎ.కొండూరు ప్రాంతంలోని కిడ్నీ సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. ఇక్కడ ప్రజలకు సురక్షితమైన కృష్ణా జలాలు తాగు నీటి వినియోగం కోసం రూ.50 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా అందించు ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుకున్నాయ్యన్నారు. పేదరికం నిర్మూలనకు పీ-4 విధానం, స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రతి గిరిజన విద్యార్థి ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, హాస్టల్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోని ఉన్నత శిఖరాలకు చేరాలని పిలుపునిచ్చారు. ముందుగా విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే, ఆర్డీవోలు గిరిజన నృత్యం చేసి పిల్లల్లో స్ఫూర్తిని నింపారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాగరికతకు పునాదులు వేసి ఆదివాసి, గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి విజయశాంతి, డీఎంహెచ్‌వో సుహాసిని తిరువూరు ఆర్డీవో మాధురి, టీడీపీ మండలాధ్యక్షుడు పీక్లానాయక్, జడ్పీటీసీ గన్యా నాయక్ పాల్గొన్నారు.

డాన్స్‌తో అలరించిన కలెక్టర్

ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో హాజరయ్యేందుకు గిరిజన ఆశ్రమ పాఠశాలకు వచ్చిన కలెక్టర్ లక్ష్మీశ, అతిథులకు గిరిజన బాలికలు తమ సంప్రదాయ దుస్తులతో స్వాగతం పలుకుతూ నృత్య ప్రదర్శన చేశారు. విద్యార్థులు నృత్యం చేస్తుంటే కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, తిరువూరు ఆర్డీవో మాధురి, డాక్టర్ దివ్య డాన్స్‌తో అలరించారు.

నిస్వార్థ సేవాతత్పరుడు మండలి కృష్ణారావు

అవనిగడ్డ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు నిస్వార్థ సేవా తత్పరుడని, తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి అని ఆయన చొరవతోనే దివిసీమ ఉప్పెన అనంతరం మరుభూమిగా మారిన దివిసీమ నేడు దివ్యసీమగా మారిందని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. మండలి కృష్ణారావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఆయన రాజకీయ ఆరంగేట్రానికి బాటలు వేసిన క్విట్ ఇండియా దినాన్ని పురస్కరించుకుని శనివారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో జస్టిస్ ఎన్వీ రమణకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవంగా పురస్కారాన్ని అందజేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణను పురస్కారంతో సత్కరించి అనంతరం ఘనంగా సన్మానించారు. మండలి ఫౌండేషన్ తరపున హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్, మండలి బుద్ధప్రసాద్ ఎన్వీ రమణకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎన్వీ రమణ మాట్లాడుతూ తెలుగు జాతి ఐక్యతకు నిర్విరామంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు అని, ఎంతో మందిలో తెలుగు భాష పట్ల స్ఫూర్తిని రగిల్చారన్నారు. విలువలు అంతరిస్తున్న నేటి రాజకీయాల్లో మండలి వెంకట కృష్ణారావును ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్ని సవాళ్లు ఎదురైనా నిక్కచ్చిగా నిలబడే మనిషి కృష్ణారావు అని అన్నారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమ కాలంలో తాము విద్యార్థి నేతలుగా ఉండేవారమని, ఆ సమయంలో సమైక్యతావాదాన్ని ప్రోత్సహిస్తున్న మండలి వెంకట కృష్ణారావును తాము కంచికచర్ల వద్ద అడ్డగించి గొడవ చేసేందుకు ప్రయత్నించామని, కానీ ఆ సమయంలో ఆయన ప్రత్యేకాంధ్ర వల్ల ఉపయోగాలేమిటో చెప్పి తనను ఒప్పిస్తే తాను కూడా ఉద్యమంలో చేరతానని చెప్పటంతో తమ వద్ద సమాధానం లేకుండాపోయిందన్నారు. 1977 ఉప్పెన అనంతరం విద్యార్థి నేతగా కొద్ది రోజులు తాను ఇక్కడ పనిచేశానని, ఆ సందర్భంలో దివి ప్రాంత పరిస్థితిని చూసి మదనపడిన కృష్ణారావును తాను చూశానన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ తెలుగు భాష కోసం నిరంతరం తాపత్రయపడే జస్టిస్ ఎన్వీ రమణకు తెలుగు భాష కోసం అహర్నిశలు కృషి చేసిన మండలి కృష్ణారావు పేరిట తెలుగు వైభవం పురస్కారం అందించటం అభినందనీయమన్నారు. మండలి వెంకట కృష్ణారావు లాంటి సేవా తత్పరుడైన వ్యక్తి పేరిట శత జయంత్యుత్సవాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని ఓ కుగ్రామంలో పుట్టిన జస్టిస్ ఎన్వీ రమణ కృషి, పట్టుదలతో భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా ఎదగటం వెనుక ఎంత కృషి ఉందో తెలుసుకోవటం ద్వారా యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. జస్టిస్ ఎన్వీ రమణకు తన తండ్రి పేరిట తెలుగు వైభవం అవార్డు ఇవ్వటం తమ అదృష్టమన్నారు. తొలుత రాజ్యసభ మాజీ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, భవఘ్ని గురూజీ, కోమటి జయరామ్ తదితరులు పాల్గొని కృష్ణారావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కృష్ణారావు రాజకీయాల్లోకి రావటానికి కారణమైన పలువురు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా సప్తపదులు పుస్తకాన్ని దేవినేని ఉమామహేశ్వరరావు, నెట్టెం రఘురామ్, కనకమేడల రవీంద్రకుమార్, మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్ పాల్గొన్నారు.

మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవం పురస్కారం అందుకున్న జస్టిస్ ఎన్వీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రమణ

భక్తి ప్రపత్తులతో దుర్గమ్మ గిరిప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ఆధ్వర్యంలో శనివారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని మాసవారీ కార్యక్రమంలో భాగంగా గిరిప్రదక్షిణ నిర్వహించారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఉత్సవమూర్తుల రహితంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ప్రచార రథంలో అమ్మవారికి హారతులిచ్చి ఈవో శీనానాయక్ కొబ్బరికాయలు కొట్టి గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, గుమ్మడికాయ బలిహరణ ఇచ్చి పూజలు చేశారు. జై భవానీ, జైజై భవానీ అంటూ భక్తుల నినాదాల మధ్య మేళతాళాలు, తప్పెట వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల భజనలు, తదితర భక్తిపారవశ్య వాతావరణంలో గిరిప్రదక్షిణ బయలుదేరింది. కుమ్మరిపాలెం సెంటర్, 4 స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేలా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ల మీదుగా బయలుదేరి తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా ఊరేగింపు కొండపైకి చేరుకుంది. గిరి ప్రదక్షణ సాగిన వీధుల్లో భక్తులు అనేక చోట్ల కొబ్బరికాయలు, పండ్లు, హారతులు సమర్పించి, పసుపు నీళ్లతో వారుపోశారు. అమ్మవారు తమకు సుఖ శాంతులివ్వాలని వేడుకున్నారు.

రైల్వే ప్రయాణికులకు రౌండ్ ట్రిప్ ప్యాకేజీ

రైల్వేస్టేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పండుగలను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న దృష్ట్యా రైల్వేశాఖ రౌండ్ ట్రిప్ ప్యాకేజీ పథకాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఏ మండ్రూపకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైతే తమ రిటర్న్ జర్నీ టిక్కెట్‌ను కొనుగోలు చేశారో వారికి మాత్రమే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ప్రయాణికుల సమూహం రాను పోను టిక్కెట్లను ముందుగానే రిజర్వ్ చేసుకోవాలి. పైగా ఏ మార్గంలో ప్రయాణించారో అదేమార్గంలో తిరిగి రావాలి. ఈనెల 14 నుంచి ప్రారంభమై అక్టోబరు 13 వరకు బుకింగ్ కొనసాగుతుంది. అక్టోబరు 13 నుంచి 26 మధ్యలో ప్రయాణపు టిక్కెట్లను కొనుగోలు చేయాలి. రిటర్న్ జర్నీలకు 17 నవంబరు నుంచి డిసెంబరు 1 వరకు బుక్ చేసుకోవాలి. రిటర్న్ జర్నీకి అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ వర్తించదు. రెండు వైపులా కన్ఫామ్ టిక్కెట్లు ఉండాలి. రిటర్న్ జర్నీలో 20 శాతం రిబేట్ కల్పిస్తారు. ఏ తరగతిలో ప్రయాణించారో అదే తరగతిలో తిరుగు ప్రయాణం కావాలి. రిఫండ్ సదుపాయం ఉండదు. ప్రత్యేక రైళ్లు మినహా రైళ్లలోనూ సదుపాయం లభిస్తుంది. ఫ్లెక్సీ ఫేర్ రైళ్లకు వర్తించదు. ఏ పరిస్థితిలోనూ మార్పులు చేర్పులుండవు. రైల్ ట్రావెల్ కూపన్లు, ఓచర్ బేసిడ్ బుకింగ్ పాస్‌లు, పీటీవో తదితరాలకు డిస్కౌంట్ ఉండదు. ఇంటర్నెట్, కౌంటర్ బుకింగ్‌లో మాత్రమే రిజర్వేషన్ చేయించుకోవాలి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505



మంటాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

పమిడిముక్కల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాస శనివారం మంటాడలో అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి పూజలో పాల్గొన్నారు. సాయిపురం గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణ అధికారి కేవీఎస్ సాయిబాబు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎ.రామమోహనరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు పాల్గొని సేవలందించారు.

చెరువు మట్టిని కొల్లగొట్టారు

- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



మాకులవారిపాలెంలో ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

కూచిపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మంత్రిపాలెం శివారు మాకులవారి పాలెంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువులో మట్టిని 20 నుంచి 25 అడుగుల లోతులో తవ్వేసి పందికొక్కుల్లా మట్టి తినేశారని, దాంతో గ్రామస్థులకు ప్రస్తుతం నీటి ఇబ్బందులు కల్పించారని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటిని అందిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఫిల్టర్ బెట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామస్థులు రహదారితోపాటు పలు మౌలిక వసతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందుగా నిడుమోలులో దెబ్బతిన్న ఎంపీపీ పాఠశాలను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, అధికారులతో చర్చించి వెంటనే మరమ్మతులు చేపడతానని పేర్కొన్నారు. అనంతరం కూచిపూడిలో సీనియర్ నాయకులు గొట్టిపాటి వెంకట్రావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆటో వర్కర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. లింగమనేని రామలింగేశ్వరరావు, గొట్టిపాటి శ్రీధర్, వీరంకి తులసీదాస్, తాతా నారాయణరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, శీలం బాబురావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ దంపతులు

గుడివాడ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరులో వేంచేసి ఉన్న గంగానమ్మ దేవాలయం జీర్ణోద్ధరణకు రాగా, శనివారం నూతన నిర్మాణానికి మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ దంపతులు భక్తుల సహకారంతో భూమి పూజ నిర్వహించారు. దళిత కాలనీలో ఉన్న ఈ దేవాలయానికి వంద సంవత్సరాల చరిత్ర ఉంది. భక్తుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణానికి పూనుకుని శనివారం భూమి పూజ చేశారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుక

గుడివాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నటుడు మహేస్‌బాబు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం కరుణాపీఠం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కూచిపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యఖర్చుల నిమిత్తం ఇద్దరు మహిళలకు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కూచిపూడి గ్రామానికి చెందిన వాకా వీర రాఘవమ్మకు రూ.42,200, కారకంపాడు గ్రామానికి చెందిన కొలుసు బేబీ సరోజినికి రూ.20,614లు సీఎంఆర్ఎఫ్ చెక్కును కుమార్ రాజా అందజేశారు. కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫలించిన ఎంపీ కృషి

పెదపారుపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కృషితో గుడివాడ నుంచి కంకిపాడు వరకు దాదాపు 27 కిలోమీటర్ల రోడ్డు ప్రాజెక్టును మంజూరు చేపించినందుకు వానపాముల టీడీపీ సీనియర్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. శనివారం విజయవాడలో బాలశౌరిని గెస్ట్ హౌస్‌లో కలసి అట్లూరి రఘురాంబ్రహ్మం, వేములపల్లి నరసింహారావు, గోపాలకృష్ణ గోకిలే కలసి పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు.

ఆత్మీయ అనుబంధాల కలయిక రక్షాబంధన్

గుడివాడ, అగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అన్నా చెల్లెళ్ళ మధ్య ఉన్న అనుబంధం, బావోద్వేగాలకు ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేకు కూటమి మహిళ నాయకురాళ్ళు, బ్రహ్మకుమారీస్. పలు రంగాలకు చెందిన మహిళలు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్క చెల్లమ్మలకు రక్షబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

పామర్రు : ఆత్మీయ అనురాగాల బంధం వేడుక రక్షాబంధన్ అని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. కలువపాములలో శనివారం ఎమ్మెల్యే కూమార్‌రాజాకు తన సోదరి మల్లవరపు అరుణకుమారి రాఖీ కట్టారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు ఆయన సోదరి అనిత ఆయన



ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్



ఎమ్మెల్యే కుమార్‌రాజాకు రాఖీ కడుతున్న సోదరి అరుణకుమారి



మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి అనిత

స్వగృహంలో రాఖీ కట్టారు. ఇదే విధంగా పలువురు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

రక్షాబంధన్ వేడుకను శనివారం పామర్రు పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు వారి పుట్టింటికి వచ్చి అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి, ఆశీర్వచనాలు పొందారు. ఏఎస్ఎం హైస్కూల్లో విద్యార్థినీవిద్యార్థులు రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొని ఒకరినొకరు సోదర భావాన్ని పెంపొందింపజేసే విధంగా రాఖీలు కట్టి తన అభిమానం చాటుకున్నారు.

కూచిపూడి : సోదర సోదరిమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను మండలంలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. సోదరి మణులు సోదరులకు రాఖీలు కట్టి వారికి మిఠాయిలు తినిపించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. సోదరులు ఈ సందర్భంగా వారికి బహుమతులు అందజేశారు. ఆలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి. చినముత్తేవి, మొవ్వ, కూచిపూడి, పెదపారుపూడి, నిడుమోలు, కాజ, కోసూరు తదితర గ్రామాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. శనివారం కావటంతో భక్తులు దేవాలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం సోదరిమణులు సోదరులకు రాఖీలు కట్టారు.

పెదపారుపూడి: అన్నాచెల్లెల అనుబంధం జన్మజన్మలకు సంబంధమని రాఖీ పండుగను తెలుగు రాష్ట్రాల్లో జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది.మహేశ్వరపురంలో పెదపూడి దుహశ్రీ తన అన్న పెదపూడి జాహ్నవ్‌నకు రాఖీ కట్టి తన తోడపుట్టిన అన్నాచెల్లెల అనుబంధాన్ని రాఖీ పండుగ సందర్భంగా చాటుకున్నారు.



కూచిపూడిలో సోదరులకు రాఖీ కడుతున్న చిన్నారి

అగ్ని ప్రమాదంలో రెండు పాడిపశువులు మృతి

- 10 ఎకరాల వరి గడ్డివామి, పశువుల పాక దగ్ధం
- 6 లక్షల ఆస్తి నష్టం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కూచిపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో కూచిపూడి గ్రామానికి చెందిన ఆయా చితుల కాశీవిశ్వనాథ శర్మకు చెందిన రెండు సూడి పశువులు మృతి చెందగా, మూడు పాడిపశువులు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ సంఘటనలో రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. తొలుత పశువుల పాకకు అగ్నిప్రమాదం సంభవించగా, ఎగసిపడిన మంటలకు 10ఎకరాల వరిగడ్డివామితోపాటు పశువుల పాక అగ్ని ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు నేతృత్వంలోని సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు.

శ్రావణ పౌర్ణమి ప్రత్యేక పూజలు

గుడివాడ, అగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా శ్రావణ పౌర్ణమి శనివారం, స్వామివారి సన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా వేంకటేశ్వరస్వామికి పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్పాలంకరణకు సహకరించిన దాతలకు స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు, అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు, పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే శాశ్వత అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన సి.బి.సుబ్రహ్మణ్యం, లీలావతి దంపతులు రూ.50,001, న్యూ ఇండియా అసూరెన్స్ కంపెనీ విశ్రాంత ఉద్యోగి తాడివాక వెంకటేశ్వరరావు, కోటేశ్వరీ దంపతులు రూ.10,116 విరాళంగా అందజేశారు.

శిబిరంలో 75 మందికి వైద్య సేవలు

పమిడిముక్కల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఐనంపూడిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 75 మందికి నేత్ర, దంత, ఇతర వైద్యపరీక్షలు చేశారు. రోటరీ కమ్యూనిటీ సర్వీసు ట్రస్టు వైద్యులు జగన్నాథరాజు, డాక్టర్ వరలక్ష్మి, సరిత, రోటరీ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పరీక్షలుచేసి ఉచితంగా మందులు పంపిణీచేశారు. క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగసుబ్రమణ్యం మాట్లాడుతూ కంటి పరీక్షల్లో అవసరమైన వారికి రోటరీ వైద్యశాలలో ఉచితంగా శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. క్లబ్ సెక్రటరీ అమీర్ మీర్జా, కేసీపీ మేనేజర్ రామచంద్రరావు, సర్పంచ్ ఏనుగు బేబీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచితవైద్య శిబిరం

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మధుమేహవ్యాధి చికిత్సా శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్ళు, కో-ఆర్డినేటర్ మూర్పూరి సుధాకర్ తెలిపారు. శిబిరంలో రక్తపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించనున్నారు.



ఐనంపూడిలో ఉచిత నేత్రవైద్య శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పీ4 సర్వేపై అవగాహన



మాట్లాడుతున్న జెడి నరసింహులు

గుడివాడ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పేద వారిని గుర్తించి ఆ కుటుంబాల బంగారు భవిష్యత్ తీర్చిదిద్దటానికే పీ4 సర్వే నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ, మండల ప్రత్యేకాధికారి నరసింహులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పీ4 సర్వేపై వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, సిబ్బంది గ్రామస్థుల దాతల సహకారంతో సర్వే గృహాలు తీసుకోవటానికి చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేను విజయవంతం చేయటానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తాడంకి జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థినులు

జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలకు తాడంకి విద్యార్థినులు

పమిడిముక్కల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవనిగడ్డలో జిల్లా స్థాయి కబడ్డీ అండర్-22 విభాగంలో బాల బాలికలకు నిర్వహించిన పోటీల్లో కంభపు బుజ్జి, సరగడ జోష్ణవి, బోయి వెంకటలక్ష్మి, పిండింట్ల పల్లవి, సాడి దీపిక ఎంపికైనారు. గుంటూరులో 11న జరిగే జోనల్ స్థాయి పోటీల్లో వీరు జిల్లా తరపున పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రవీంద్రబాబు తెలిపారు.

బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారికి నాగ హారతి అందించిన భక్తులు

కూచిపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరిదేవికి కోపూరి శ్రీనివాస్, కోడూరు అమరేశ్వరరావు, కనగాల బ్రహ్మం దంపతులు నాగ హారతిని ఆలయ అర్చకులు పెనుమూడి పూర్ణచంద్రశేఖర శర్మ, సతీష్ కుమార్ శర్మలకు అందజేశారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి



కాటూరులో సుపరిపాలనలో తొలిఅడుగులో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

ఉయ్యూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. సుపరిపానలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం కాటూరు బీసీ కాలనీలో పర్యటించి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు అమ లుచేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారని. దీపం పథకం ద్వారా ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తున్న చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సజ్జా మధు, సీనియర్ నాయకుడు వేమూరు శ్రీనివాసరావు, కోడె హరీశ్, శరత్, యుగబాబు, చీలి సుధాబాబు, ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

కొండాలమ్మ ఆలయంలో రుద్రహోమం



కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుడ్లవల్లేరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ ఆలయంలో శనివారం రుద్రసహిత చండీహోమం శనివారం నిర్వహిం చారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అలివేటి మండపంలోని యాగ స్థానంలో రుద్ర సహిత చండీ హననం, పూర్ణాహుతి నిర్వహించారు.

అంగన్వాడీలకు కనీస వేతనం అందించాలి

గుడివాడ, అగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, వేసవి సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.కృష్ణవేణి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం భవన్‌లో శనివారం యూనియన్ జిల్లా పదో మహాసభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణవేణి మాట్లాడుతూ బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులను పెంచాలని, కార్మిక కోడ్‌లను రద్దు చేయాలన్నారు. అనంతరం యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా ఎం.సువర్ణలత, ప్రధాన కార్యదర్శిగా ఎ.రమాదేవి, కోశాధికారిగా ఎ.నాగమణిలతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ గుడివాడ అధ్యక్ష, కార్యదర్శులు వై.గీత, టి.వాణి, ప్రాజెక్టు నాయకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

● ప్రజలకు ఎస్పీ గంగాధరరావు సూచన

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 9(ఆంధ్రజ్యోతి): 'వినూత్న పద్ధతుల్లో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. అప్రమత్తంగా లేకుంటే భారీ మొత్తంలో నగదును కోల్పోవాల్సి వస్తుంది. బ్యాంకు లావాదేవీలకు ఓటీపీ, పిన్ నెంబర్లు, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోవద్దు.' అని ప్రజలకు ఎస్పీ ఆర్. గంగాధరరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మోసం జరిగితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆకట్టుకున్న మండలి కృష్ణరాయ వైభవం

అవనిగడ్డ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం గాంధీక్షేత్రం వేదికపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ రచించిన మండలి వెంకట కృష్ణరాయ వైభవం నృత్య రూపకం ప్రదర్శన ఆసాంతం ఆకట్టుకుంది. విద్యార్థుల అభినయంలో దివిసీమ ఉప్పెన ఘట్టం అందరినీ కంటతడి పెట్టించింది. మండలి వెంకట కృష్ణారావు వంశం, బాల్యం, చిన్నతనంలోని సత్యాగ్రహులకు పూలదండలు వేసి పోలీసులతో లాఠీ దెబ్బలు తినడం, అంచెలంచెలుగా ఎదిగి మంత్రి పదవి అలంకరించడం, ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించడం, పూలదండలు వేసుకోనని ప్రతిజ్ఞ చేయడం, దివిసీమలో అభివృద్ధికి దోహదపడేలా ఆర్టీసీ, ఫైర్ స్టేషన్, ఎదురుమొండి పంపింగ్ స్కీమ్, కోర్టులు, ఎల్‌ఐసీ, కరెంటు తీసుకురావడం, సముద్రపు కరకట్ట, ఆక్విడెక్ట్ పెంపు వంటి సమాజ సేవా కార్యక్రమాలు, ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం, తుపాను తర్వాత దివిసీమ పునర్నిర్మాణం తదితర ప్రధాన ఘట్టాలను ఈ రూపకంలో ప్రదర్శించారు. గాంధీక్షేత్రంలో జస్టిస్ నూతలపాటి వెంకటరమణకు మండలి వెంకట కృష్ణారావుకు పురస్కారాన్ని అందించే సందర్భంలో ఈ రూపకాన్ని విద్యానికేతన్ విద్యార్థులు, అర్చన నృత్యాలయ విద్యార్థులు 70 మంది అద్భుతంగా రక్తి కట్టించారు. ప్రముఖ కళాకారులు సూరగం రామకృష్ణప్రసాద్, డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, అశ్వారావుపాలెం వైస్ ప్రెసిడెంట్ యక్కటి నాగరాజులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్ తదితరులు ఘనంగా సత్కరించారు.



మండలి కృష్ణరాయ వైభవం సంగీత నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు



స్వామి చిత్రపటం, ప్రసాదాలను జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు అందిస్తున్న ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు

సుబ్బారాయుడి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు

మోపిదేవి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు, హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్ శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి దేవినేని ఉమా పూజలు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు వారికి స్వాగతం పలికారు.

ఫరీద్‌బాబాకు ప్రత్యేక ప్రార్థనలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బందరు మండలం చినకరగ్రహారంలో శనివారం నిర్వహించిన ఫరీద్‌బాబా జన్మదిన వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. దర్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్, బత్తిన నాగరాజు పాల్గొన్నారు.



దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 17వ డివిజన్‌కు చెందిన సుంకర సరస్వతి బంధువులకు శనివారం మంత్రి కొల్లు రవీంద్ర రూ.1,43,338 సీఎం సహాయ నిధి చెక్కును అందచేశారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ మరకాని సమతాకీర్తి, మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని పాల్గొన్నారు.

పెన్నేరమ్మ సంబరాలు ప్రారంభం

ఘంటసాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత పెన్నేరమ్మ అమ్మవారి 83వ గ్రామ సంబరాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్యాంక్ సెంటర్ వద్ద ఉన్న ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఘటాలకు కృష్ణానదిలో నది స్నానాలు చేయించి తీసుకొచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. పురవీధుల్లో సంచరిస్తున్న అమ్మవారికి భక్తులు వార పోసి టెంకాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. ఆదివారంతో సంబరాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

రాఘవేంద్రస్వామి ఆరాధనా మహోత్సవాలు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని రాఘవేంద్రస్వామి ఉపాలయంలో శనివారం స్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. 12వ తేదీ వరకు నిర్వహించే ఈ ఆరాధనోత్సవాల్లో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు అనంత పద్మనాభ భజన మండలి వారితో పురందరదాసు కీర్తనలు గానం చేస్తారని ఈవో తెలిపారు. అర్చకుడు వి.విజయకుమార్ పాల్గొన్నారు.



మచిలీపట్నం ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఆర్టీసీ స్థలాలు లీజుకు ఇవ్వొద్దు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నర్‌పేట 1, 2 డిపోలు, పాత బస్టాండ్ స్థలాలు షాపింగ్‌మాల్‌కు లీజుకు ఇవ్వొద్దంటూ శనివారం ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి వైవి.రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో జిల్లా కమిటీ సభ్యులు ఎల్.ఆర్.బాబు, బి.కృష్ణ, రాజేష్‌యాదవ్, పి.రాజేంద్ర పాల్గొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 137 జీవోను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకాన్ని స్వాగతిస్తున్నామని వారు తెలిపారు.

రాజకీయశక్తిగా ఎదిగితేనే దళితులకు రాజ్యాధికారం

అవనిగడ్డ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం దక్కాలంటే దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారం దక్కినప్పుడే అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆంధ్రా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ హెచ్‌వోడీ డాక్టర్ గోవాడ వీర్రాజు అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నీలా శ్యామ్యూల్ ఇంటి వద్ద రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం నిర్వహించిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. 8వ వార్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. దోవా గోవర్ధన్, డాక్టర్ నీలా విక్టర్‌బాబు, నాదెళ్ల అరవిందకుమార్, మత్తే నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

పిల్లలకో బహుమతి కథల సంపుటి ఆవిష్కరణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బాల సాహిత్యంపై రచయితలు ప్రత్యేక దృష్టి సారించాలని న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. రచయిత కళ్లేపల్లి ఏడుకొండలు రచించిన పిల్లలకో బహుమతి కథల సంపుటిని మహతి కళావేదికపై శనివారం నిర్వహించిన సభలో ఆయన ఆవిష్కరించారు. సెల్‌ఫోన్ యుగంలో పిల్లలకు గ్రంథ పఠనం అలవాటు తగ్గిపోతోందన్నారు. నీతి కథల ద్వారా పిల్లల్లో విలువలు పెరుగుతాయన్నారు. పుస్తకాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు విశ్లేషించారు. భవిష్య అధ్యక్షత వహించిన ఈ సభలో తెలుగు సమాఖ్య ప్రతినిధి అప్పినీడి పోతురాజు, మేడిశెట్టి యోగేశ్వరరావు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లంకిశెట్టి బాలాజీ తదితరులు

మండలి వెంకట కృష్ణారావుకు ఘన నివాళి

నాగాయలంక, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దివిసీమ పునర్నిర్మాత ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో భాగంగా శనివారం 6వ రోజు కూటమి మండల నేతలు మండలి వెంకట కృష్ణారావు విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, ఉప్పల ప్రసాద్, గుడివాక శివరావు, బండ్రెడ్డి హరి, బొడ్డు విజయ్ యాదవ్, కైతేపల్లి ఆనంద్, భోగాది సతీష్ పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి విరాళం

కోడూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కోడూరులో పునర్నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి గ్రామానికి చెందిన బడే బాపనమ్మ, ఆయన కుమారుడు మణిశంకర్, కుమార్తె లావణ్య రూ.1,01,116 విరాళమిచ్చారు. శనివారం నగదును కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, జూపూడి సుభాష్ చంద్రబోస్, బడే భావన్నారాయణ, బడే వెంకటేశ్వరరావు, బడే శ్రీరాంబాబు, ఉల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

పెడన రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నందిగం గ్రామంలో జన్ను నాగేశ్వరమ్మ(85) అనారోగ్యంతో మృతిచెందారు. పేద కుటుంబం కావటంతో అంతిమ సంస్కారాలకు దావోజీపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు కాగిత నాగేశ్వరరావు రూ.5 వేలను శనివారం కుటుంబసభ్యులకు అందించారు. నందిగం పీఏసీఎస్ అధ్యక్షుడు యారగాని నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

చల్లపల్లి/నాగాయలంక, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సోదరీ సోదరుల ప్రేమకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. అన్నదమ్ములకు సోదరీమణులు రాఖీలు కట్టారు.

పులిగడ్డ గురుకుల విద్యాలయం వద్ద..

అవనిగడ్డ రూరల్: పులిగడ్డ గురుకుల విద్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు వారి సోదరీమణులు పెద్ద సంఖ్యలో విచ్చేసి రాఖీలు కట్టారు.

హైనీ బాలికల వసతి గృహంలో..

మచిలీపట్నం టౌన్: మదర్ హైనీ బాలికల వసతి గృహంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ లింగం మోజెస్, రోటరీ సెక్రటరీ ఉదయకిరణ్, దాసరి విజయకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. మోజెస్ చేతికి హాస్టల్ విద్యార్థులు రాఖీలు కట్టారు.





పులిగడ్డ గురుకుల విద్యాలయం వద్ద సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు, చల్లపల్లిలో రాఖీ కడుతున్న చిన్నారి

పరమశివుడికి ప్రత్యేక అర్చనలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లోని శివలింగానికి వేదపండితులు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. చిట్టిపాలెం దత్తసాయి పాదుకా మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 108 లీటర్ల ఆవుపాలతో శివలింగానికి నమక చమకాలతో అభిషేకాలు చేశారు. డాక్టర్ చావలి పవన్, వంశీ, మహంకాళి, గురుతేజ శర్మ, ఘంటసాల మారుతీసాయిరామ్, సాయిరామ్‌శర్మ పాల్గొన్నారు.



మంగినపూడి బీచ్‌లో శివలింగానికి అర్చనలు చేస్తున్న వేదపండితుడు

ఆలయాల్లో పూజలు

పెడన రూరల్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా చెన్నూరులోని గంగా పార్వతీ సమేత నారద లింగేశ్వరస్వామి, ఉప్పల కలవగుంటలోని నాగేశ్వర స్వామి, మడకలోని భోగేశ్వరస్వామి, చోడవరంలోని కాశీ విశ్వేశ్వరస్వామి, ఉరివి, బల్లిపర్రు, నడుపూరు, నందిగం, లంకలకలవగుంట గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పెడన: శ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరోత్సవం నిర్వహించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ బండారు ఆనందప్రసాద్, శ్యామలాంబ తల్లి ఆలయ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ ఊటుకూరి శ్రీగిరి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణసాయి మందిరంలో ప్రత్యేక పూజలు

చల్లపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా పురిటిగడ్డలోని శ్రీకృష్ణసాయి ధ్యానమందిరంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీలక్ష్మీగణపతి హోమం, దత్త హోమం, పూర్ణాహుతితోపాటు సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక సిరిగుప్ప వాస్తవ్యులు కొసరాజు బాలాజీ- లక్ష్మిశ్రీ దంపతులు, విజయవాడకు చెందిన శీలం దుర్గాశ్రీనివాసరావు-శ్రీలత దంపతులు, వేమూరి దుర్గా శివప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. నాదెళ్ల వామనరావు, సుంకర గాంధీ వరప్రసాద్, కేవీ శివరామకృష్ణప్రసాద్(చంటి) అన్నదానం నిమిత్తం విరాళం అందించారు. ఆలయ ట్రస్టీ ఛైర్మన్ నాదెళ్ల శివరామకృష్ణ, గ్రామపెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



నాగూర్‌మీరా జెండా వద్ద పూజలు చేస్తున్న నేతలు

వైభవంగా నాగూల్‌మీరా సాహెబ్ జెండా పండుగ

నాగాయలంక, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున మత్స్య భవనం దిమ్మె వద్ద శనివారం నాగూల్‌మీరా సాహెబ్ 46వ వార్షిక జెండా పండుగ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పోతురాజు స్వామి ఆలయం నుంచి అలంకరించిన జెండాను మత్స్యకార నేతలు పురవీధుల్లో ఊరేగించి దిమ్మ వద్ద ప్రతిష్ఠించారు. అగ్నికుల క్షత్రియుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్రి ప్రసాద్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి వెంకట్రామ్, మండవ బాలవర్థిరావు, తలశిల స్వర్ణలత, కర్రి కృష్ణమూర్తి, గుడివాక శివరావు, సైకం భాస్కరరావు, లకనం నాగాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): 45వ డివిజన్ సచివాలయంలో ఆదివారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, వైద్యులు ముత్తేవి కృష్ణమాచార్యులు, ముత్తేవి రాజారవికిరణ్ సేవలందిస్తారని టీడీపీ 45వ డివిజన్ నాయకుడు పీవీ ఫణికుమార్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరపత్రాలను ఆవిష్కరించారు.



కానూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

రైతుల అభ్యున్నతే ధ్యేయం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. శనివారం బందరు మండలం కానూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పీతా రాము, బొమ్మిడి ఏడుకొండలు, గోపు వెంకటరమణ, బొలిశెట్టి నాని, మోపిదేవి కృష్ణ, బోట్ల సాయి, మోకా రాజు, చిన్నా, కొక్కిలిగడ్డ గోవింద్ పాల్గొన్నారు.

పాత నడకుదురులో..

చల్లపల్లి: పాత నడకుదురులో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మాతంగి వేణు తదితరులు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల అమలును వివరించారు. పెద్దిబోయిన హరినాథ్, మాతంగి గంగాధరరావు, పుట్టి చంద్రశేఖరరావు, రాజులపాటి జగదీష్, పుట్టి ప్రకాష్, పుట్టి సుబ్రహ్మణ్యం, మహేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



క్లబ్ అధ్యక్షురాలు విజయదుర్గను సన్మానిస్తున్న డాక్టర్ చిన్నా

ఉత్తమ క్లబ్‌గా పెడన వాసవీ క్లబ్

పెడన, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పెడన వాసవీ క్లబ్‌ను ఉత్తమ క్లబ్‌గా ప్రకటిస్తూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ అన్నం సునీత ఉత్తర్వులు జారీ చేశారు. క్లబ్‌కు అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న కొమ్మూరి విజయదుర్గ పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు ఈ గుర్తింపు లభించింది. విజయదుర్గను వాసవీ ప్రార్థనా మందిరంలో ఆర్యవైశ్య పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి చిన్నా సన్మానించారు. సభ్యులు పాల్గొన్నారు.

సాగునీరు పూర్తిస్థాయిలో విడుదల చేస్తున్నాం

● ఇరిగేషన్ ఈఈ రవికిరణ్

కోడూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కేఈబీ కెనాల్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ ఈఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. శనివారం మండలంలో ఆయన పర్యటించారు. నార్త్ చానల్, కోడూరు 11వ నెంబర్ కాల్వకు సాగునీటి సరఫరాను, నారుమడులను పరిశీలించారు. కాలువ దిగువ ప్రాంతాలకు నీరు అందేలా వంతుల విధానం ద్వారా నీటిని విడుదల చేస్తున్నామన్నారు. పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ గణపతి, ఏఈ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



నారుమడులకు నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ రవికిరణ్

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పులిగడ్డలో అలివేలు మంగ రాజ్యలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి శాంతి కల్యాణాన్ని అర్చకుడు విఖనస ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. 12 మంది దంపతులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యుడు మండలి భావన్నారాయణ పర్యవేక్షించారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు